RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 238 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 సెప్టెంబర్ 2024 గురువారం పేజీలు : 4

## మయన్మార్‌లో యాగీ తుఫాను బీభత్సం

బ్యాంకాక్ : యాగీ టైఫూన్ మయన్మార్‌లో విధ్వంసం సృష్టించింది. పెను తుఫాను ప్రభావంతో వరదలు పోటెత్తడంతోపా టు పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ఇప్పటివరకు దాదాపు 226 మంది ప్రాణాలు కోల్పోగా 77 మంది గల్లంతైనట్లు అధికారిక మీడియా వెల్లడించింది. తుఫాను బీభత్సానికి దాదాపు 6.31 లక్షల మంది ప్రభావితులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. సుమారు 1.60 లక్షల ఇళ్లు ధ్వంసం కాగా లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దేశవ్యాప్తంగా లక్షల మంది బాధితులు ఆహారం, నీరు, సరైన ఆశ్రయం లేక అల్లాడుతున్నారని ఐరాసకు చెందిన మానవతా సహాయ సంస్థ వెల్లడించింది. మరోవైపు యాగీ టైఫూన్ ఆగ్నేయాసియా దేశాలను బెంబెలెత్తించింది.




# రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తగ్గం

## చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి

### ఎంఎస్ఎంఈ పాలసీ - 2024 ప్రారంభ సభలో సీఎం రేవంత్

హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కార్ పార్టీలకతీతంగా అభివృద్ధి ఫలాలను అందజేస్తోందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎంఎస్ఎంఈ పాలసీ–2024ని బుధవారం ప్రారంభించింది. మాదాపూర్ శిల్పకళా వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ఎంఎస్ఎంఈ లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర సంపదను పెంపొందించాలనే ఉద్దేశంతోనే ఎంఎస్ఎంఈ పాలసీ–2024 ను ఆవిష్కరించాం. దేశ ఆర్థికస్థితి దెబ్బతిన్న కాలంలో నాటి ప్రధాని పీవీ నరసింహారావు దూరదృష్టితో ఆలోచించారు. పారిశ్రామిక విధానంలో సరళీకృత విధానాలు తీసుకొచ్చి ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారు. ప్రపంచంతో పోటీ పడేలా విధి విధానాలు రూపొందించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మంత్రి శ్రీధర్ బాబు గొప్ప ఆలోచన చేశారు. ఆయనకు నా అభినందనలు. పాలసీ డాక్యుమెంట్ లేకుండా ఏ రాష్ట్రం అభివృద్ధి సాధించదు. అందుకే తాజా పాలసీని ప్రభుత్వం తీసుకొచ్చింది. గత ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తూనే... కొత్త పాలసీని ముందుకు తీసుకెళ్తాం. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ.. అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజకీయాలు లేవు. కాంగ్రెస్ పార్టీ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోంది. మంచి పనులు ఎవరు చేసినా వాటిని కొనసాగిస్తాం. రాష్ట్ర ప్రయోజనానికి విఘాతం కలిగించే అంశాలపై చర్యలు తీసుకునే విషయంలో వెనకాడబోం. ప్రస్తుతం చదివిన చదువుకు, పారిశ్రామిక అవసరాలకు మధ్య అంతరం ఏర్పడింది. అందుకే రాష్ట్రంలోని 65 ఐటీఐలను అధునాతన టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం. టాటా ఇనిస్టిట్యూట్‌తో కలిసి వాటిని రూ.2 వేల 400 కోట్లతో ఆధునీకరిస్తున్నాం. పూర్తి అధ్యయనం తరువాత యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసాం. ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం అందించేలా యువతకు శిక్షణ ఇవ్వనున్నాం. యూనివర్సిటీ నిర్వహణకు పారిశ్రామిక వేత్తల నుంచి రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయబోతున్నాం. వీటిని యూనివర్సిటీ నిర్వహణకు ఖర్చు చేసేలా ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేసింది. ప్రభుత్వం చేస్తున్న ఈ పని రాజకీయ ప్రయోజనాల కోసం కాదు" అని సీఎం పేర్కొన్నారు.

**అగ్రికల్చర్ అనేది మన కల్చర్..** రైతన్నలు వ్యవసాయాన్ని వదలవద్దని సీఎం రేవంత్ కోరారు. కాంగ్రెస్ వచ్చాక వ్యవసాయాన్ని పండగ చేసి చూపించినట్లు చెప్పారు. "రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి వ్యవసాయం పండగ అని నిరూపించాం. అయినా వ్యవసాయం ద్వారా వచ్చిన ఆదాయం రైతుల కుటుంబాలకు సరిపోవడంలేదు. తెలంగాణ రైతాంగానికి ఈ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నా. వ్యవసాయాన్ని వదలొద్దు.. అగ్రికల్చర్ అనేది మన కల్చర్.. వ్యవసాయం చేసే వాళ్లు వ్యవసాయం చేస్తూనే కుటుంబ సభ్యులను ఉపాధి అవకాశాలవైపు మళ్లించండి. వ్యాపారాల్లో రాణించేలా తీర్చిదిద్దండి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నాం. ఫ్యూచర్ సిటీలో లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఫార్మా ఏర్పాటు చేస్తాం. మూసీ అంటే మురికి కూపం కాదు. మూసీని మ్యాన్ మేడ్ వండర్‌గా తీర్చిదిద్దుతాం. మా ప్రభుత్వం గత ప్రభుత్వంలా గడీల మధ్య లేదు. ప్రజల కోసమే పని చేసే సర్కారిది. ప్రజలకు ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయి. అందరి సలహాలు, సూచనలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం. స్వయంసహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేసే ప్రయత్నం చేస్తున్నాం. శిల్పారామంలో 3 ఎకరాల స్థలంలో స్వయం సహాయక మహిళల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం సదుపాయం కల్పిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో నిర్వహణ మహిళల చేతుల్లోపెట్టాం.

మహిళా సంఘాలకే స్కూల్ యూనిఫామ్ కుట్టు పని బాధ్యతలు ఇచ్చాం. యూనిఫామ్ ధరను రూ.25 నుంచి రూ.75 చేసి ఆడబిడ్డలను ఆర్థికంగా ఆదుకుంటున్నాం. ఎంఎస్ఎంఈలు బలపడితేనే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. వాటికి సంపూర్ణంగా సహకరిస్తాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

## నోటరీ డాక్యుమెంట్లపై స్పెషల్ డ్రైవ్

### స్టాంప్ డ్యూటీ తీసుకుని వ్యాలిడేట్ చేయనున్న సర్కారు

### రాష్ట్రంలో ఇకపై ఈ-రిజిస్ట్రేషన్లు!

### అన్నిరకాల అగ్రిమెంట్లు ఆన్‌లైన్‌లోనే

**సినీ హీరోల యాడ్స్, మూవీల విషయంలోనూ అమలు**




హైదరాబాద్ : నోటరీ చేసుకుని రిజిస్ట్రేషన్ కాని డాక్యుమెంట్లపై రాష్ట్ర సర్కారు స్పెషల్ డ్రైవ్ చేపట్టనుంది. రిజిస్ట్రేషన్ చేసుకోని డాక్యుమెంట్లపై స్టాంప్ డ్యూటీ తీసుకుని, ఆ డాక్యుమెంట్లను వ్యాలిడేట్ చేయాలని భావిస్తున్నది. దీంతో ప్రభుత్వానికి రాబడితోపాటు ఆ వ్యాలిడేటెడ్ డాక్యుమెంట్లను కోర్టుల్లో ఉపయోగపడేలా చేయనున్నట్లు తెలిసింది. అగ్రిమెంట్ ఆఫ్ సేల్, సేల్ డీడ్‌తో పాటు తదితర ఎవిడెన్సులతో నోటరీ చేసుకుంటారు. అలా నోటరీ చేసుకుని రిజిస్ట్రేషన్ కాకుండా ఉన్న డాక్యుమెంట్లు లక్షల్లో ఉన్నాయి.

అటువంటి వాటికి పెనాల్టీ లేకుండా, ట్రాఫిక్ చలాన్లకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లుగానే నోటరీ డాక్యుమెంట్ల వ్యాలిడేషన్‌పైనా స్పెషల్ డ్రైవ్ చేపట్టేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. అదే సమయంలో అనధికారికంగా జరిగే అగ్రిమెంట్లను కూడా అథరైజ్? చేయాలని సర్కారు భావిస్తున్నది.

**వెబ్‌సైట్ నుంచే అప్లికేషన్లకు చాన్స్ :** ఇటీవల మహారాష్ట్రలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు స్టడీ చేసి వచ్చారు. దీని ఆధారంగా తెలంగాణలోనూ మార్పులు చేయాలని నివేదించారు. మహారాష్ట్రలో ఉన్నదాని ప్రకారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లీజు అగ్రిమెంట్లు, రెంటల్ అగ్రిమెంట్లు, కొనుగోళ్లు, అమ్మకాలు, ఇతర పనుల ఒప్పందాలకు సంబంధించి ఈ– రిజిస్ట్రేషన్ అందుబాటులోకి తీసుకురావాలని అనుకుంటున్నది. ఇందుకు ప్రత్యేక ఆప్షన్‌ను కల్పించేందుకు కసరత్తు చేస్తున్నది.

ఇలా చేయడంతో ప్రభుత్వానికి ఆదాయంతోపాటు వినియోగదారులకూ ఒక అథరైజ్డ్ డాక్యుమెంట్‌ను ఇచ్చినట్లు అవుతుందని భావిస్తోంది. ఫలితంగా అగ్రిమెంట్లు చేసుకునేవారి మధ్య ఏమైనా తగాదాలు, వివాదాలు వచ్చినా పరిష్కరించుకునే వెసులుబాటు కలగనుంది. ఇలాంటి అగ్రిమెంట్లు మాత్రమే కాకుండా సినిమా హిరోలు, ఆర్టిస్టులు వివిధ కంపెనీలతో చేసుకునే అడ్వర్టయిజ్‌మెంట్ ఒప్పందాలకుకూడా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ వెబ్‌సైట్ ద్వారా అప్లై చేసుకునేలా ప్లాన్ చేస్తున్నారు.

**స్టాంప్ డ్యూటీ కిందకు కార్పొరేట్ ప్రకటనలు :** ఇప్పటి వరకు సేల్, గిఫ్ట్, మార్టిగేజ్, డెవలప్‌మెంట్, లీజు అగ్రిమెంట్లు వంటి పత్రాల ద్వారా స్టాంప్ డ్యూటీ ఎక్కువగా వస్తోంది. ఇందులో దాదాపు 70 శాతం ఆదాయం విక్రయాలకు సంబంధించిన డాక్యుమెంట్ల ద్వారానే సమకూరుతోంది.

పుస్తకాల కాపీరైట్లు, ప్రకటనలు, హీరోల ఒప్పందాలు, కార్పొరేట్ ప్రకటనలు, రియల్ ఎస్టేట్ ప్రకటనల ఒప్పందాల వంటివి అనధికారికంగా జరిగిపోతున్నాయి. ఇవేమీ స్టాంప్ డ్యూటీ పరిధిలో ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టడం లేదు. దీంతో వీటికి కూడా ఆన్‌లైన్‌లో అప్లై చేసేలా వెసులుబాటు కల్పించి, ప్రభుత్వానికి కొంత ఫీజు తీసుకుని అథరైజ్డ్ చేయాలని చూస్తున్నది. ఇందుకు యూజర్ ఫ్రెండ్లీ మాదిరిగా రిజిస్ట్రేషన్ సైట్‌లో ఆప్షన్లు ఇవ్వాలని భావిస్తోంది.



## తెలంగాణకు మళ్లీ వర్షాలు.. ఎల్లో అలర్ట్ జారీ !

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అలర్ట్. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ భారీ వర్షాలు కురవనున్నాయి. వారం రోజుల నుంచి ఎలాంటి వర్షాలు లేకుండా పొడి వాతావరణం ఉన్న రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురవనున్నాయి. ఈ నెల 21, 22 తేదీలలో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిజామాబాద్, నిర్మల్, సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు సంభవించే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రజలు ఎక్కువగా బయట తిరగవద్దని సూచిస్తున్నారు.

# ఇద్దరూ ఇద్దరే..!

## ఇటు చంద్రబాబు - అటు మోడీ..



## వీరి రికార్డులు అన్‌స్టాపబుల్..!

ఇద్దరిదీ దాదాపు ఒకే వయసు. కాకపోతే కొన్ని నెలలు తేడా..! ఇద్దరూ రాజకీయంగా అనేక మెట్లు ఎక్కిన వారే. అనేక ఇబ్బందులు ఎదిరించిన వారే. అంతేకాదు.. ఇద్దరూ సమస్యలను సవాళ్లుగా తీసుకుని ముందుకు సాగిన వారే. వారే.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ.

వీరిద్దరూ అనితర సాధ్యులు ! దేశ రాజకీయ చిత్ర పటంలో ఇద్దరు నాయకులు ఈ తరహా రాజకీయాలు చేసిన చరిత్ర వీరితోనే ప్రారంభ మవుతుందనడంలో సందేహం లేదు. వీరితోనే ముగిసినా ఆశ్చర్యం లేదు. నిన్న (సెప్టెంబరు 17) ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 74వ పుట్టిన రోజు. ఈ సందర్భంగా దేశం మొ త్తం మోడీ స్మరణలో మునిగిపోయింది. అయితే.. ఇదే వయసున్న ఏపీ సీఎం చంద్రబాబు పేరు కూడా ఈ రోజు యాదృచ్ఛికంగా జాతీయ మీడియాలో ప్రముఖంగా వచ్చింది. దీనికి కారణంగా గుజరాత్‌లో జరుగు తున్న పునరుత్పాదక ఇంధన వనరుల సమ్మేళనంలో సోమవారం సీఎం చంద్రబాబు చేసిన అద్భుత ప్రసంగమే. ఈ ప్రసంగాన్ని యథాతథంగా గుజరాత్ సహా జాతీయ మీడియా ప్రచురించింది. అయితే.. ఇటు ప్రధాని.. అటు సీఎంల జోష్ నేపథ్యంలో ఇరువురునేతల అభిమానులు కూడా.. వారి రాజకీయ ప్రస్థానాలను స్మరించుకుంటున్నారు. మోడీ విషయానికి వస్తే.. అనేక ఇబ్బందులు .. అనే మరకలు.. మచ్చలను దాటుకుని 2000–2001 మధ్య గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యారు. చంద్రబాబు విషయానికి వస్తే.. 1995–96 మధ్య ఒక అనూహ్యమైన పరిస్థితిలో ముఖ్యమంత్రి అయ్యారు. చంద్రబాబు వరుసగా రెండు సార్లు అధికారంలోకి వస్తే.. మూడు సార్లు మోడీ సీఎం అయ్యారు. ఈ క్రమంలో చంద్రబాబుకు ఒకదఫా ప్రదాని అయ్యే అవకాశం కూడా వచ్చింది. కానీ, ఆయనే వదులుకు న్న విషయం తెలిసిందే. మోడీకి మాత్రం విధిలేని పరిస్థితిలో బీజేపీ నుంచి ప్రధాని ఆఫర్ వచ్చింది. రెండుమూడు నెలల తర్వాత మార్చేయాలని అనుకున్న బీజేపీ అగ్రనాయకత్వం మూడుదఫాలుగా ఆయననే కొనసాగించింది. ఇక, ఏపీలో టీడీపీ వస్తుందో రాదో అని అనుకున్న సమయంలోచంద్రబాబు విశ్వరూపం ప్రదర్శించారు. ఫలితంగా టీడీపీ గెలుపు గుర్రం ఎక్కింది. ఇలా.. కొన్ని సారూపత్యలు ఉన్నాయి. ఇక, ఇద్దరూ విజనరీ లీడర్లే కావడం గమనార్హం. ఇద్దరూ భవిష్యత్ దార్శనికులే కావడం మరింత విశేషం. సో.. ఇటు చంద్రబాబు–అటు మోడీ.. వీరి రికార్డులు అనితర సాధ్యం!!

# సంపాదకీయం

## కాశ్మీరులో ముందే చేతులెత్తేసిన కమలం ?

జమ్మూ కాశ్మీర్ ని గెలిచి అధికారం చేపట్టాలన్నది బీజేపీ పూర్వ రూపం అయిన జన సంఘ్ నాటి నుంచి ఉన్న కోరిక. అసలు జమ్మూ కాశ్మీర్ వివాదమే జన సంఘ్ పురుడు పోసుకోవడానికి ఒక ప్రధాన కారణం అని కూడా అంటారు. 1952 ఎన్నికల్లో జనసంఘ్ ఆవిర్భవించి పోటీ చేసింది. అలా చూసుకుంటే బీజేపీ మొత్తం రాజకీయ ప్రస్థానం ఏడు పదులుగా చెప్పాలి. అలా ప్రాచీనమైన పార్టీగా ఉన్నా బీజేపీ కాశ్మీర్ కోరిక అలాగే ఉంది. కాంగ్రెస్ చాలా సార్లు అధికారం అందుకుంది. కానీ బీజేపీ 2014 లో జమ్మూలో పాతిక సీట్లు గెలిచి పీడీఎఫ్ తో జత కట్టి ఉప ముఖ్యమంత్రి పీఠం దాకా వచ్చింది. ఈసారి ఆర్టికల్ 370 రద్దు చేశామని కాశ్మీర్ ప్రజలు అంతా తమ వెంటే అని చెప్పుకున్న బీజేపీ జమ్మూలో ఉన్న 43 అసెంబ్లీ సీట్లకు పోటీ పెట్టింది. కానీ కాశ్మీర్ లో ఉన్న 47 సీట్లలో కేవలం 19 చోట్ల మాత్రమే పోటీకి నిలిపింది. మిగిలిన 28 అసెంబ్లీ స్థానాలను అలా వదిలేసింది. మరి కసిగా కాశ్మీర్ ఎన్నికల్లో పోటీకి దిగిన కమలం ఎందుకు ఇలా ఎన్నికలకు ముందే చేతులు ఎత్తేసింది అన్న చర్చ అయితే అంతటా సాగుతోంది. అయితే కాశ్మీర్ లా 370 ఆర్టికల్ ఎత్తేసి వారిని భారత్ లో అంతర్భాగం చేసినా కూడా బీజేపీకి రాజకీయంగా అనుకూలత అయితే లేదు అనే అంటున్నారు. దానికి కారణం స్థానికులు అంతా జమ్మూ కాశ్మీర్ లో స్వీయ పాలననే కోరుకుంటున్నారు అని అంటున్నారు. కాశ్మీర్ లో అత్యధిక శాతం ముస్లిములు ఉన్నారు. వారంతా బీజేపీని వ్యతిరేకిస్తున్నారు అని అంటున్నారు. దాంతో సరైన బలమైన అభ్యర్థులు బీజేపీకి దొరకలేదని, గెలుపు అవకాశాలు కూడా తక్కువగా ఉన్నాయని అంటున్నారు. దాంతో ఎక్కువ చోట్ల నిలబెట్టి నామ్ కే వాస్తే అన్నట్లుగా పోటీ చేసి పరువు తీసుకోవడం ఎందుకు అన్న ఉద్దేశ్యంతోనే బీజేపీ కాశ్మీర్ లో కేవలం 19 సీట్లకే పరిమితం అయింది అని అంటున్నారు. దీని మీద కాశ్మీర్ లో ఉండే బీజేపీ నేతలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోటీ చేసి ఉండాల్సింది అని వారు అంటున్నారు. అయితే అధినాయకత్వం మాత్రం అనవసరం అన్నట్లుగానే సందేశం ఇచ్చింది అని వారు అంటున్నారు. బలహీనంగా ఉండే చోట్ల పార్టీ పోటీకి పెట్టడం మంచిది కాదు అని భావించే పోటీ చేయడం లేదని బీజేపీ నేతల నుంచి పరోక్షంగా వస్తున్న మాటగా ఉంది. కేవలం ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీ కాశ్మీర్ లోయలో తన పార్టీ అభ్యర్థులను పోటీకి దించలేదు అని అంటున్నారు. అదే బీజేపీకి జమ్మూలో బలం ఉంది. అక్కడ పోటీ చేసి రెండు ఎంపీ సీట్లను కైవశం చేసుకుంది. జమ్మూలో హిందువులు ఎక్కువ. బీజేపీకి ఆదరణ కూడా ఎక్కువ. కానీ కాశ్మీర్ లో మాత్రం బీజేపీ మీద జనంలో నిరసనలు ఆందోళనలు అలాగే ఉన్నాయి. భద్రతా బలగాలతో వాటిని ఇంతకాలం అదిమి పట్టి ఉంచినా గ్రౌండ్ లెవెల్ రియాల్టీస్ ఏంటో బీజేపీకి బాగా తెలుసు కాబట్టే కాశ్మీర్ లో పోటీ నుంచి తప్పుకుంది అని అంటున్నారు. ఇక బీజేపీ అయితే పూర్తి ఆశలు జమ్మూ మీదనే ఉంచుకుంది. కాశ్మీర్ లో వీక్ గా ఉన్నమని అంగీకరిస్తోంది. ఆ పార్టీ నిలబెట్టిన 19 మంది అభ్యర్థులలో ఏడుగురు గెలుపు గుర్రాలు అవుతారని లెక్క వేసుకుంటోంది. ఇక జమ్మూలో మొత్తం 43 సీట్లకు గానూ అత్యధికం గెలుచుకుంటే కనుక అంటే 35 దాకా గెలిస్తే కాశ్మీర్ లో ఏడు కలుపుకుని 42 దాకా చేరుకోవచ్చునని మ్యాజిక్ ఫిగర్ కి అవసరం అయిన నాలుగు సీట్లను ఇండిపెండెంట్ల ద్వారా సాధించి జమ్మూ అండ్ కాశ్మీర్ లో ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు అన్నది ఒక అంచనాగా చేసుకుంది మరి కాశ్మీర్ లోయలో బీజేపీకి ఏడు సీట్లు వస్తాయా జమ్మూలో 35 సీట్లు గెలుస్తుందా అంటే చూడాల్సిందే. ఇక ఈ నెల 18 నుంచి మూడు విడతలుగా జమ్మూ అండ్ కాశ్మీర్ లో ఎన్నికలు జరుగుతున్నాయి.

# వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చి రైతులను లాభాల బాటలోకి తీసుకెళ్లడమే సహకార సంఘం ధ్యేయం

### శామీర్ పేట రైతు సహకార సంఘంలో కూరగాయలు, పండ్ల కలెక్షన్ కేంద్రాన్ని ప్రాంభించిన టీఎస్ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్రావు





శామీర్ పేట, (గరుడ వార్త) : వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చి రైతులు పండించిన కూరగాయాలు, పండ్లకు అధిక లాభాలను కల్పించడమే సహకార సంఘాల ధ్యేయమని టీఎస్ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్రావు తెలిపారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేట లోని రైతు సహకార సంఘంలో నాబార్డ్, ప్రపంచ బేయర్ సంస్థ, రోస్లిన్ ఆసియా ప్రతినిధి ప్రాజెక్ట్ ప్రతినిధులు భాగస్వామ్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన కూరగాయాలు, పండ్ల కలెక్షన్ సెం టర్ ను టీఎస్ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ప్రారంభించారు. అలాగే ఫెస్టిసైడ్, ఎరువుల విక్రయ కేంద్రాన్ని డసీసీబీ చైర్మన్ సత్తయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండిస్తున్న కూరగాయలు దళారీలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దళారీల బారి నుంచి రైతులను కాపాడి లాభాలను గడించేలా వినూత్నంగా సహకార సంఘం ఆధ్వర్యంలో కూరగాయల, పండ్ల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు నష్టపోకుండా అందుబాటులో, అనుకూలంగా కూరగాయాలను గిట్టుబాటు ధరలకు సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేయడమే ముఖ్య ఉద్దేశమని ఆయన చెప్పారు. అలాగే రైతులకు అందుబాటులో నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను సైతం తక్కువ ధరలకే అందించేలా సొసైటీ ఆధ్వర్యంలో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు పండించిన టువంటి కూరగాయలను దూరంగా ఉన్న మార్కెట్లోకి రవాణా చేయడం వల్ల ఖర్చులు, కమీషన్, సమయం అధికమై రైతులు నష్టాలకు గురవుతున్నారని ఆయన అన్నారు. రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్లో ఎటువంటి దళారీ వ్యవస్థ, కమీషన్ లేకుండా విలువైన రైతు సమయాన్ని వృదా చేయకుండా ఆదా చేసేలా సొసైటీ పరిధిలోనే శామీర్ పేట రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం రాష్ట్ర చరిత్రలోనే విప్లవాత్మకమైన మార్పని, సొసైటీ చైర్మన్ మధుకర్రెడ్డిని ఆయన అభినందించారు. శామీర్ పేట రైతు సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ నష్టాల ఊబీలో ఉన్న ఈ రైతు సహకార సంఘాన్ని అంచలంచలుగా డైరక్టర్ల సహకారంతో లాభాల బాటలోకి తీసుక వచ్చామన్నారు. రైతులకు అందుబాటులో, అనుకూలంగా పంటల పెట్టుబడికై సల్పకాల, దీర్ఘకాల పంటరుణాల సౌకర్యాన్ని కల్పించినట్లు చెప్పారు. శామీర్ పేట రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవసరమయిన ఎన్నో సౌకార్యాలను వినూత్నంగా కల్పిస్తు విప్లవాత్మకమైన మార్పులను తీసుకవచ్చినట్లు తెలిపారు. అలాగే మండలంలోనిరైతులకు అనుకూలంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటును విస్తరించినట్లు తెలిపారు. నాబార్డు వారి రుణసహాయంతో శామీర్ పేట,మూడుచింతలపల్లి మండలాల్లో అగ్రిఔట్లెట్లను, గోదాములను రైతులకు అనుకూలంగా నిర్మింపచే సినట్లు చెప్పారు. తాను రైతులకు అందుబాటులో ఉంటు సొసైటీ ఆధ్వర్యంలో రైతుల ఆర్థికాభివృద్ధికి చేయూత నిస్తున్నట్లు వివరించారు.
ఈ కార్యక్రమంలో నాబార్డు సీజీఎం సుశీల, ప్రపంచ బేయర్ సంస్థ ప్రతినిధి జెర్మివిలియంస్, రైతు సహకార సంఘం వైస్ చైర్మన్ మ్యాకల ఐలయ్య యాదవ్, డైరకర్లు, రైతులు పాల్గొన్నారు.

## లడ్డు వేలం పాటలో 11,51,111/-వేలం పాటలో వచ్చిన 90% శాతం డబ్బు సమాజ అభివృద్ధికే ...





శామీర్పేట (గరుడ వార్త) : శామీర్పేట మండల కేంద్రంలోని రూలర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించినానంతరం బుధవారం రాత్రి నిర్వహించిన లడ్డు వేలం పాటలో 11,51,111/- రూపాయలకు వేలంపాటలో రూలర్స్ యూత్ ట్రస్ట్ కైవసం చేసుకుంది. ఈ డబ్బులోంచి వచ్చే వినాయక ఉత్సవాలకు కేవలం 10 శాతం నిధులు వాడుకొని, మిగతా 90 శాతం నిధులు సమాజాభివృద్ధి విద్యా, వైద్యం సేవలకు గాను డబ్బులు, వినియోగించనున్నట్లు ఆ ట్రస్టు సభ్యులు వివరించారు.

# ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులతో వైకుంఠధామం లో బోరు బావి

### మండల అభివృద్ధికి సీఎం నిధుల నుండి కోటి రూపాయలు మంజూరు

శామీర్ పేట, (గరుడ వార్త) : టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చొరవతో సీ ఎం ప్రత్యేకనిధి నుంచి మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి కొరకు 10 కోట్లు మంజూరు చేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు యాదవ్ తెలిపారు. బుధవారం మూడు చింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో మండలానికి కేటాయించిన కోటి రూపాయల నిధులనుంచి స్మశానంలో బోరుబావిని తవ్వించారు. ఈ సందర్భంగా నరసింహులు యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గానికి 10 కోట్లు సీఎం నిధి నుంచి మంజూరు చేసి మండలానికి కోటి రూపాయలు విడుదల చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా మూడు చింతలపల్లి మండల అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేయగా వాటిలో ప్రతి గ్రామానికి 10 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఉద్దె మర్రి గ్రామంలోని స్మశాన వాటికలో బోరు వేయించినట్లు తెలిపారు. మండల అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేసిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దోసకాయల వెంకటేష్,



బాల్ నర్సింహ్మ, గ్రామ అధ్యక్షుడు తుంకి వెంకటేష్, మండల నాయకులు నేమూరి విష్ణు గౌడ్, ప్రవీణ్ యాదవ్, నల్ల ప్రభాకర్ రెడ్డి, అగమయ్య, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ప్రకృతి సోయగం ఆస్వాదిస్తే ఆనందం

ఆదిలాబాద్ :ఈ పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో నిలదొక్కుకునేందుకు జనాలు తీవ్ర ఒత్తిడి, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. అందుకు వారు తమ జీవన శైలిని మార్చుకుంటున్నారు. వారాంతపు సెలవుల్లో మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. మానసికోల్లాసాన్ని పొందుతున్నారు. ప్రపంచ పిక్నిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొన్ని పిక్నిక్ పాయింట్లను వివరిస్తూ కథనం.
ప్రయోజనాలు ఇలా.. : పిక్నిక్‌కి వెళ్తే ప్రకృతిని ఆస్వాదించవచ్చు. ఒత్తిడి నుంచి ఉపశమనం ఉంటుంది. మంచి వ్యాయామం అవుతుంది. తాజా గాలి, సూర్యరశ్మి లభిస్తుంది.
కాలక్షేపానికి 'హరితవనం'
చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ హరితవనం వెళ్లేందుకు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇక్కడ పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. విజ్ఞానాన్ని పెంపొందించేలా పక్షులు, వన్య ప్రాణులు, మృగాల బొమ్మలు ఏర్పాటు చేశారు. సాహస క్రీడలు, బోటింగ్, రోప్‌పైన స్కై సైక్లింగ్ వంటి కృత్యాలు వర్షాకాలంలో చేసుకోవచ్చు. అటవీశాఖ నిర్వహణలో ఈ హరితవనం పని చేస్తుంది. ప్రవేశ రుసుము చెల్లించి లోనికి వెళ్లవచ్చు. పిక్నిక్ కోసం బడి పిల్లలు వచ్చి ఆడుకుంటారు. కాలక్షేపంతో గడుపుతుంటారు. ఆదిలాబాద్



నుంచి 7 కి.మీ.ల దూరంలో ఉంది.
వచ్చిందంటే చాలు చాలా మంది ఖండాల ప్రాంతానికి వెళ్తుంటారు. ప్రకృతి ఒడిలో విహరించినట్లు అనుభూతి పొందుతారు. పచ్చని అడవి, చిన్న చిన్న గుట్టల అందాలను చూడాల్సిందే. ఇక్కడ ఉండేందుకు గదులు లేవు. చాలా మంది ఇంటి నుంచే తయారు చేసుకున్న భోజనాలు తీసుకు వెళ్తుంటారు. ఇంకొందరు అక్కడే వంటలు చేసి ప్రకృతి రమణీయతను చూస్తూ వన భోజనాలు చేస్తుంటారు. ఇది ఆదిలాబాద్ గ్రామీణ మండలం నుంచి 40 కి.మీ.లు, ఇంద్రవెల్లి నుంచి 9 కి.మీ.ల దూరంలో ఉంది. మొలలగుట్ట వరకు వాహనాలు వెళ్తాయి. అక్కడి నుంచి 2 కి.మీ.లు కాలినడకన వెళ్తే ఖండాల పిక్నిక్ పాయింట్ వస్తుంది. గలగలపారే జలధార 'కుంటాల'
ప్రకృతి ప్రసాదించిన కుంటాల జలపాతం తెలంగాణలోనే ఎత్తైనది. గలగలపారే ఆ జలధార వద్ద నగరం నిద్రపోతున్న వేళ, రుద్రమదేవి వంటి సినిమాల సన్నివేశాలు, పాటలను చిత్రీకరించారు. జలపాతం సమీపంలో విశ్రాంతి భవనం ఉంది. దీన్ని ముందస్తుగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడే చిన్న హోటళ్లు ఉన్నాయి. సందర్శకుల కోసం చిన్న గుడారాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి 62 కి.మీ.లు, నేరడిగొండ మండలం నుంచి 12 కి.మీ.ల దూరంలో ఈ కుంటాల జలపాతం ఉంది. జూన్ నుంచి డిసెంబరు వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జలపాతాన్ని వీక్షించవచ్చు.
మానసికోల్లాసానికి 'పొచ్చెర జలపాతం'
ఆత్మీయ సమ్మేళనాలకు పొచ్చెర జలపాతం వేదికగా మారింది. వర్షాకాలంలో వీటి అందం రెట్టింపవుతుంది. జలపాతం సమీపంలో షెడ్‌ను నిర్మించారు. ఇక్కడ సమావేశాలు, భోజనాలు చేసుకునేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. భోజన సౌకర్యం లేదు. ఎవరికి వారే తమవెంట స్నాక్స్, భోజనం తెచ్చుకుంటారు. మానసికోల్లాసాన్ని పంచుతున్న పొచ్చెర జలపాతం బోథ్ మండల కేంద్రం నుంచి 4 కి.మీ.లు, ఆదిలాబాద్ నుంచి 45 కి.మీ.ల దూరంలో ఉంది.

# చలో ఇంద్ర పార్క్ ధర్నాను విజయవంతం చేయాలి : ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహాయ కార్యదర్శి



శామీర్ పేట, (గరుడ వార్త) : చలో ఇంద్ర పార్క్ ధర్నాను విజ యవంతం చేయాలని ఐ ఎఫ్ టి యు రాష్ట్ర సహా కార్యదర్శి శివ బాబు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రం శామీర్ పేట లో చలో ఇందిరా పార్కు వాల్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శివ బాబు మాట్లాడుతూ లేబర్ కోడ్, నేర చట్టాల సవరణలను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, స్కీం కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాల న్నారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారంకై కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.కేంద్రంలో మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేసిందని, స్వదేశీ, జాతీయత, దేశభక్తి పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను, ఆస్తులను, సహజ వనరులను, ఖనిజసంపదను కార్పోరేట్ సంస్థలకు అమ్మి వారి ఆస్తులు, సంపదను పెంచిందన్నారు. కార్మిక వర్గం దేశవ్యాప్త నిరసనలు, పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వాటి అమలు ను ఆపిందని, 3వ దఫా అధికారంలోకి రాగానే 100 రోజులలో లేబర్ కోడ్లను అమలు చేస్తానని ప్రకటించిందని, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి బొగ్గు గనులతో సహా అన్ని రకాల గనులను వేలం పాటలు పెట్టి ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. బ్రిటిష్ కాలం నాటి వలసవాద చట్టాలను సవరించి పౌరులకు స్వేచ్ఛ, సత్వరం న్యాయం చేస్తామని మూడు నేర చట్టాలను సవరించి 2024జూలై 1 నుంచి అమలు చేస్తున్నదన్నారు. ఈ నేర చట్టాలలో 90 శాతం యధాతధంగా ఉంచి పేరు మార్చి సెక్షన్ లు మార్చిందని విమర్శించాడు. వలస చట్టాల కంటే మరింత ప్రమాదకరం గా సర్వాధికారాలు పోలీస్ యంత్రాంగానికి ఇచ్చిందని, . పౌరుల, సంఘాల, ప్రశ్నించే గొంతుకలను, పార్టీలపై ఉక్కు పాదం మోపి అణిచివేసే విధంగా ఈ చట్టాలను సవరించిందని ఆరోపించాడు. ప్రభుత్వ రంగ సంస్థలలో పర్మినెంట్ కార్మికులను తగ్గించి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను నియమిస్తున్నారని విమర్శించాడు. సమానపనికి సమాన వేతనం లేదని, కనీస వేతనం అమలు జరగడంలేదని, ఇతర చట్టబద్ధ హక్కులు లేవన్నారు. ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం, కేజీబీవీ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులను వెట్టిచాకిరితో పనిచేపిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 30న నగరంలోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాను కార్మికులందరికీ వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఐ ఎఫ్ టి యు కార్మికులు బాల నరసింహ, స్వామి, రమేష్, సుగుణమ్మ, కమలమ్మ, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మారనున్న చర్లపల్లి రోడ్ల రూపురేఖలు

హైదరాబాద్: చర్లపల్లి రైల్వేస్టేషన్ రోడ్ల రూపురేఖలు మారిపోనున్నాయి. నగరంలోని నాలుగో రైల్వే టెర్మినల్ రోడ్డు కష్టాలు త్వరలో తీరబోతున్నాయి. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ రెండు రోడ్డు అభివృద్ధి ప్రణాళికలను(ఆర్‌డీపీ) రూపొందించింది. వాటిని తాజాగా కమిషనర్ ఆమ్రపాలి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి తీసుకెళ్లారు. భూసమస్యను సైతం ఆయన ముందుంచారు. వెంటనే సీఎం ఇతర ప్రభుత్వ శాఖలతో మాట్లాడి భూసేకరణ అడ్డంకులను తొలగించారు. నెలలో రోడ్లు పూర్తవ్వాలని జీహెచ్ఎంసీకి స్పష్టం చేశారు. ఇంకేముంది.. రోడ్లు వేయడమే తరువాయి అంటూ నగర ప్రణాళిక విభాగం, ఇంజినీర్లు రంగంలోకి దిగారు.

కీలకమైన రవాణా కేంద్రంగా..

సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లకు మించి, విమానాశ్రయాన్ని తలదన్నే ఆకృతిలో కేంద్రం చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తోంది. మొత్తం 9 ప్లాట్‌ఫామ్‌లు, రెండు బడా ఎఫ్‌వోబీలు, ఆరు ఎస్కలేటర్లు, ఏసీ, నాన్‌ఏసీ విశ్రాంతి గదులు, రిజర్వేషన్, టికెట్ కౌంటర్లు, ఆహార, విడిది కేంద్రాలతో స్టేషన్‌ను దాదాపు 100 ఎకరాల్లో నిర్మిస్తోంది. ఏడాది చివరికి కొత్త స్టేషన్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే అక్కడ 13 జతల రైళ్లు ఆగుతుండగా, భవిష్యత్తులో 45 జతల కొత్త రైళ్లను అక్కడి నుంచి నడపాలన్నది దక్షిణ మధ్య రైల్వే ఆలోచన. కానీ.. మల్లాపూర్–చర్లపల్లి ప్రధాన రహదారి నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే 30అడుగుల కాలనీ రోడ్లను ఆశ్రయించాల్సి



వస్తోంది. స్టేషన్ ముందు 1000 మంది ప్రయాణికులు కూడా నిలిచే పరిస్థితి లేదు.

మూడు ప్రధాన ద్వారాలతో..

చర్లపల్లి రైల్వే స్టేషన్ ముందు భాగంలోని భూమిని సేకరించి మూడు ప్రధాన ద్వారాలను నిర్మించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. 100అడుగుల వెడల్పుతో రెండు, 80 అడుగుల రోడ్డుతో మరో ద్వారం అభివృద్ధి చేయనున్నారు. వీటిని 100అడుగుల రోడ్డుతో కలుపుతారు. దాని అవతల పార్కింగ్ కేంద్రాలు, బస్టాండు, ఆటో స్టాండ్‌ల నిర్మాణానికి భారీగా స్థలాన్ని వదులుతారు. వంద అడుగుల రోడ్డు కోసం అటవీశాఖ 3ఎకరాల భూమిని ఇవ్వనుంది. ఇతర రహదారులకు 6–7ఎకరాల పరిశ్రమలశాఖ భూమిని ఉపయోగించుకోనున్నారు. స్టేషన్ వెనుకవైపు కొన్ని ఇళ్లను తొలగించి 80అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. మొత్తంగా రూ.35కోట్ల అంచనా వ్యయంతో కొత్త రోడ్లు రాబోతున్నాయి. రోడ్లు అయ్యాక స్టేషన్ ముందు మరింత భూసేకరణ చేపట్టి ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచే మౌలిక సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నట్టు జీహెచ్ఎంసీ తెలిపింది. భవిష్యత్తులో కొన్ని పరిశ్రమలు బయటకు వెళ్లాక మరో 200ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి అందనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# పల్లె దవాఖానాల్లో మూలుగుతున్న నిధులు

నకిరేకల్ : రోగాలు ప్రబలుతున్నాయి.. పల్లె, పట్నం తేడాలేకుండా జ్వరాలు విజృంభిస్తున్నాయి. వైద్యశాలలతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల (పల్లె దవాఖానాలు)కు రోగుల తాకిడి పెరుగుతోంది. మందులకూ తీవ్ర కొరత ఉంది. అధిక శాతం అద్దె భవనాల్లో కొనసాతున్న ఆరోగ్య ఉప కేంద్రాల్లో అసౌకర్యాలు తిష్టవేశాయి. గత నాలుగేళ్ల నుంచి వీటి అద్దెల బిల్లులు విడుదల కాకపోవడంతో ఏఎన్ఎంలపై భారం పడుతోంది. వైద్యులు, సిబ్బంది, రోగులు కూర్చునేందుకు సరైన కుర్చీలు, బల్లలు లేవు. బీపీ ఆపరేటర్లు అక్కడక్కడా మొరాయిస్తున్నాయి. ఐఈసీ (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) కార్యక్రమాల కోసం జిల్లాలోని ఆరోగ్య ఉపకేంద్రాలకు ఆరు నెలల కిత్రం విడుదలైన నిధులు బ్యాంకు ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. ఉప కేంద్రాల్లో సుశిక్షితులైన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లు చికిత్సలు అందిస్తుండటంతో వీటిల్లో ఓపీ సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కనీస సదుపాయాలు లేక రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పల్లె దవాఖానాల్లో అందుతున్న సేవలు, ఆరోగ్య కార్యక్రమాలు, రోగాలు బారిన పడకుండా ప్రజలు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహించేందుకు, కరపత్రాలు, గోడపత్రికలు, వాల్‌రైటింగ్‌ల వంటివి చేపట్టేందుకు ఐఈసీ నిధులు వ్యయం చేయాల్సి ఉంటుంది. నిధులు సిద్ధంగా ఉన్నా అవగాహన, చైతన్య కార్యక్రమాలు మాత్రం అధికారులు చేపట్టడం లేదు. ఉప కేంద్రాల్లో చిన్నచిన్న సామగ్రి కొనుగోలుకు కూడా ఈ నిధులు వినియోగించుకునే వీలుంది.

ఆరు నెలలుగా ఖాతాల్లోనే రూ.56.70 లక్షలు

జిల్లాలో 39 పీహెచ్‌పీల పరిధిలో 195 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. 189 ఉపకేంద్రాలను పల్లె దవాఖానాలుగా నిర్వహిస్తున్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు బాధ్యులుగా ఉన్న ఉపకేంద్రాలకు ఒక్కోదానికి రూ.30వేల చొప్పున ఐఈసీ కార్యక్రమాల కోసం ప్రభుత్వం ఆరు నెలల క్రితం విడుదల చేసింది. ఆయా మండలాల పీహెచ్‌సీ వైద్యాధికారి, ఉపకేంద్రం ఇన్‌ఛార్జిగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీల సంయుక్త బ్యాంకు ఖాతాల్లో జమైన దాదాపు రూ.56.70 లక్షలు ఆరు నెలల నుంచి మూలుగుతుండటం గమనార్హం.

మార్గదర్శకాలు అందాల్సి ఉంది –పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో, నల్గొండ ఈ నిధుల వ్యయానికి సంబంధించి ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు అందాల్సి ఉంది. అవి అందిన వెంటనే ఐఈసీ కార్యక్రమాల కోసం నిబంధనల ప్రకారం ఈ నిధులను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటాం.

# మూడు నెలలవుతున్నా ముందుకు కదలరేం?



గోదావరిఖని: కార్మికుల పిల్లలకు సింగరేణి యాజమాన్యం జారీచేసిన వయోపరిమితి పెంపు అమలు కావడం లేదు. దీంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కరోనా సమయంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ పరీక్షలు నిర్వహించడం ఆలస్యం కావడంతో వారి వయోపరితి దాటిపోయింది. దీన్ని ప్రత్యేక పరిస్థితుల కింద గుర్తించి 35 నుంచి 40 ఏళ్లకు వయోపరిమితిని పెంచుతూ యాజమాన్యం ఆదేశాలు జారీచేయగా.. అమలు కావడంలో మాత్రం ఆలస్యం జరుగుతోంది.

40 ఏళ్లు కూడా దాటిపోతున్నాయి!

ఇప్పటికే నాలుగేళ్లు నిరీక్షించగా.. దీంతో 40 సంవత్సరాల వయోపరిమితి కూడా దాటిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. కొవిడ్–19 సమయంలో రెండేళ్లపాటు మెడికల్ పరీక్షలు నిర్వహించలేదు. కరోనా ముగిసిన రెండేళ్లకు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేశారు. అప్పటికే కొంతమంది వారసులకు 35 ఏళ్లు దాటిపోయాయి. దీంతో వారిని ఉద్యోగానికి తీసుకోకుండా పెండింగ్‌లో పెట్టారు. దీనికి యాజమాన్యం ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించి 40 ఏళ్లకు వయోపరిమితిని సవరిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

జారీచేసి 3 నెలలు గడిచినా..

వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసి మూడు నెలలు గడిచిపోయింది. ఈ ఏడాది జూన్‌లో ఆదేశాలు జారీ చేసిన యాజమాన్యం.. పెండింగ్‌లో ఉన్న వారసులు దరఖాస్తు చేసుకోవాలని కోరింది. దీంతో కార్మికుల పిల్లలు వారి తండ్రులు పనిచేసిన కార్యాలయాల్లో తమ వివరాలు అందజేశారు. అయితే మూడు నెలలు గడుస్తున్నా ఉద్యోగాలకు సంబంధించిన చర్యలు చేపట్టలేదు. దరఖాస్తు చేసుకున్నవారిని ఎప్పుడు పిలుస్తారా అని ఎదురుచూస్తున్నారు.

1500 మందికి నిలిపివేత..

సింగరేణి వ్యాప్తంగా 1500 మంది వారసులకు వయోపరిమితి పెరిగిన కారణంగా ఉద్యోగాల్లోకి తీసుకోకుండా నిలిపివేశారు. వారికి ప్రత్యేకంగా జారీ చేసిన ఆదేశాలతో ఉద్యోగానికి మార్గం సుగుమం అయిందనే సంతోషం వ్యక్తమైనా.. మళ్లీ మూడు నెలలుగా జాప్యం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సిన యాజమాన్యం.. దరఖాస్తు చేసుకున్న కార్మికుల పత్రాలు కార్పొరేట్ వరకు మాత్రమే వెళ్లాయి. అక్కడి నుంచి మార్గదర్శకాలు వస్తేనే మిగతా ప్రక్రియ మొదలు పెడతామన్న సమాధానాలు కార్యాలయాల సిబ్బంది నుంచి వినిపిస్తోంది.

# ఫిర్యాదులు వచ్చే వరకు ఆగకండి..



సిరిసిల్ల: విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన గురువుల్లో కొందరి తీరు ఆ వృత్తికే కళంకం తెచ్చేలా ఉంది.. కొన్నిచోట్ల విద్యార్థులు కూడా తోటి విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఫిర్యాదు చేస్తే ఏమవుతుందోనని చాలామంది విద్యార్థినులు మిన్నకుండిపోతున్నారు. పరిస్థితి విషమించినప్పుడు తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నారు.. వసతి గృహాలు, గురుకులాల్లో పరిస్థితి మరోలా ఉంది. విద్యార్థినులు ఫోన్ చేయాలంటే అందులో పనిచేసే సిబ్బంది ఫోన్‌ని ఉపయోగించాలి. దీంతో వారు ఎదుర్కొంటున్న సమస్యను ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుట చెప్పలేకపోతున్నారు. తల్లిదండ్రులు సందర్శనకు వచ్చినపుడే ఇలాంటి విషయాలు ఎక్కువ శాతం వెలుగులోకి వస్తున్నాయి.

విద్యార్థినులు, యువతులు, మహిళల రక్షణే ధ్యేయంగా షీ బృందాలు పని చేస్తున్నాయి. ఈ బృందాలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే అవగాహన కార్యక్రమాలు పట్టణ ప్రాంతాలకే ఎక్కువగా పరిమితమవుతున్నాయి. దీంతో విద్యార్థినులు తమ ఆవేదన చెప్పుకోవడానికి అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికైనా అవగాహన కార్యక్రమాలు పెంచి విద్యార్థినులతో ప్రత్యేకంగా మాట్లాడితే వారిపై అనుచితంగా ప్రవర్తిస్తున్నవారి వివరాలు బయటపడే అవకాశం ఉంది.

సెప్టెంబర్ 12 2024

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి పాఠశాలలోని విద్యార్థినుల పట్ల ఇద్దరు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయం గత వెలుగులోకి వచ్చింది. విద్యార్థినుల తల్లిదండ్రులు ఓ ఉపాధ్యాయుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదైంది. విద్యాశాఖ విచారణ జరుగుతోంది.

సెప్టెంబర్ 12 2024

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గిరిజన గురుకుల పాఠశాల మహిళా పీఈటీ విద్యార్థినులతో వ్యవహరించిన తీరుపై గత గురువారం ఆందోళన చేశారు. ఇష్టం వచ్చినట్లు కొట్టడంతోపాటు వీడియోలు తీస్తున్నారని ఆరోపించారు..

డిసెంబర్ 2022

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థినులు గతేడాది వేధింపులపై అప్పటి కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో సఖి సిబ్బంది, షీ బృందం పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడగా ఓ ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన వెలుగులోకి వచ్చింది. ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ఈ ఏడాది జనవరిలో సిరిసిల్ల పట్టణంలోని ఓ ఉన్నత పాఠశాలలో సామాజిక మాధ్యమాల్లో విద్యార్థినుల ఫొటోలను మార్ఫింగ్ చేసి వాటితో అసభ్యంగా ఛాటింగ్ చేస్తున్న విషయం వెలుగు చూసింది.. దీనిపై బాధితులు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేశారు. వారు పాఠశాలకు వెళ్లి విచారించగా అదే పాఠశాలలోని విద్యార్థులు ఈ పని చేసినట్లు గుర్తించారు. విద్యార్థులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోక్సో) అత్యంత కఠినమైనది. బాధితుల వాగ్మూలంతో నమోదయ్యే కేసులో 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. దీనిపై విస్తృత ప్రచారం కల్పిస్తే వికృత చేష్టలు చేయడానికి జంకుతారు. ఒక్కసారి కేసు నమోదైతే ఉద్యోగావకాశాలు కోల్పోతారు.

ఉమ్మడి జిల్లాలో చిన్నారులపై అఘాయిత్యాలు వాటిపై నమోదయ్యే కేసులు ఏటా పెరుగుతున్నాయి. 2023లో పోక్సో కేసులు 146 నమోదవగా ఈ ఏడాది ఇప్పటికే 89 కేసులు నమోదయ్యాయి. అవగాహనతో బయటకు వచ్చి ఫిర్యాదు చేస్తున్న వారు కొందరైతే.. సమాజానికి భయపడి లోపలే కుమిలిపోయే వారు మరెందరో.. పాఠశాలల్లోనే కాదు బయటకూడా చిన్నారులపై ఆకృత్యాలు ఎక్కువే ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోని సఖి కేంద్రాలు, షీ బృందాలు పాఠశాలల మొదలు ఇంజినీరింగ్, వైద్య కళాశాలల వరకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలి. స్థానిక పోలీసులు, షీ బృందాల చరవాణి నంబర్లు ప్రతి విద్యాసంస్థలో కనిపించేలా అతికించాలి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటిలోనూ సఖి, షీ బృందాలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం చెప్పారు. పోలీసుశాఖ సహకారం తీసుకుంటామన్నారు.

# సాగుకు డ్రోన్ల 'సహకారం'

కరీంనగర్ : ఆధునిక సేద్యానికి రైతులు ముందుకొస్తున్న తరుణంలో వారికి అవసరమైన తోడ్పాటునిస్తున్నామని.. ఎకరాల కొద్దీ ఎరువులను చల్లేందుకు వీలుగా డ్రోన్ల రూపంలో వ్యవసాయానికి సహకారం అందిస్తున్నామని సహకార శాఖ జిల్లా అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను గతానికి భిన్నంగా రైతులకు మేలు చేసే వనరులుగా మారుస్తామని, పారదర్శక విధానాలను అవలంభిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. రుణాలు మొదలు.. రికవరీ వరకు అన్ని విషయాల్లో మంచి పనితీరుని జగిత్యాల జిల్లాలో కనబరుస్తామంటున్న అధికారి 'ఈనాడు– ముఖాముఖి'లో వెల్లడించిన విషయాలిలా..

విస్తృత అవకాశాలు..

రైతులను అన్నిరకాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు విస్తృత అవకాశాలున్నాయి. 51 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్) పరిధిలో ఇప్పుడున్న పరిస్థితుల్ని సమగ్రంగా అధ్యయనం చేస్తున్నాం. ఏరకంగా అన్నదాతలకు మేలు చేయవచ్చనే విషయమై ప్రణాళికల్ని రూపొందిస్తున్నాం. గతంలో జరిగిన లోటుపాటు, ఇక్కట్లు, నిధుల దుర్వినియోగం ఇలా చాలా సమస్యలున్నాయి. వీటన్నింటిని పర్యవేక్షిస్తూ ఇక మీదట పూర్తిగా రైతుకు జవాబుదారీ తనం సహకార సంఘాల ద్వారా అందే విధంగా చొరవ చూపిస్తాం. సిబ్బంది పనితీరులో మార్పు కనిపిస్తుంది. కర్షకుల ఆలోచనలకనుగుణంగా సమష్ఠి నిర్ణయాలతో అన్ని సంఘాలను ఆదర్శనీయంగా మారుస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లబ్ధి చేకూరుస్తాం.

ఆర్‌ఆర్ చట్టంతో వసూలు..రైతుల శ్రేయస్సుకు పాటుపడాల్సిన కొన్ని సంఘాలు నిధుల్ని దుర్వినియోగం చేసిన ఆరోపణలున్నాయి. వీటి విచారణలు పూర్తయ్యాయి. ఇంకా పెండింగ్‌లో ఉన్నవాటిని గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. కొన్ని న్యాయస్థానం పరిధిలో ఉన్నాయి. రెండు కేసులు కొలిక్కి వస్తున్నాయి. మూడు సంఘాలకు సర్‌ఛార్జీలు త్వరలో జారీ చేస్తాం. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం అక్రమాలకు పాల్పడిని పాలకవర్గాలకు, అక్కడి సిబ్బందికి తాఖీదులిచ్చి దుర్వినియోగమైన మొత్తాన్ని తిరిగి ప్రభుత్వ ఖజానాకు చేరుస్తాం. ఇక మీదట ప్రత్యేకంగా ఎప్పటికప్పుడు రైతుల సొమ్మును వినియోగించే విషయంపై ప్రత్యేక దృష్టి పెడుతాం. ఎక్కడ కూడా అవినీతి అక్రమాలకు తావులేకుండా మా పర్యవేక్షణను కొనసాగిస్తాం. ప్రస్తుతం కొన్ని సంఘాల్లో ఆడిట్ జరుగుతుంది. పూర్తయ్యాక సర్వసభ్య సమావేశాన్ని పెడతాం.

ఉపకరణాలతో ఆదాయం..ప్రస్తుతం ఇఫ్కో వారి సహకారంతో సారంగపూర్, ఇబ్రహీంపట్నం, వల్లంపల్లి, మెట్ల చిట్టాపూర్, గంభీర్‌పూర్, మెట్‌పల్లి, ఇటిక్యాల సంఘాల పరిధిలో పెద్ద డ్రోన్‌లున్నాయి. వీటి ద్వారా గంటకు తక్కువ ఖర్చుతో పురుగుమందులను పిచికారీ చేసే వ్యవస్థ అందుబాటులో ఉంది. వీటిని తక్కువ మొత్తంతో రైతుకు అద్దెకిస్తున్నాం. శిక్షణ పొందిన మా సిబ్బంది పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఇక మీదట ఇంకొన్ని ఆధునిక ఉపకరణాలను మా సంఘాల్లో అందుబాటులో ఉంచాలనుకుంటున్నాం. అన్నదాతల ఆలోచనల మేరకు త్వరలో హార్వెస్టర్లు కొనుగోలు చేస్తాం. ఆగ్రో సహకారంతో ఇతర ఉపకరణాల్ని తెచ్చి తక్కువ అద్దెతో అందిస్తూ ప్యాక్స్‌లను లాభదాయక సంఘాలుగా మారుస్తాం. ఇక రసాయన ఎరువుల వాడకం విపరీతమవుతున్న తరుణంలో ప్రత్యామ్నయంగా సేంద్రియ ఎరువుల తయారీకి ప్రాధాన్య తనిస్తాం. జీలుగు, పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తాం. విత్తనాలు మొదలు పంట ఉత్పత్తులు అమ్మకం వరకు మాశాఖ సహకారం అందిస్తాం. ఈ ఏడాదిలో మా సంఘాల తరపున 3.07లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నాం.

# డెంగీ పంజా

భువనగిరి : జిల్లాపై డెంగీ పంజా విసురుతోంది. గతేడాదితో పోల్చితే ఈసారి తీవ్రత చాలా ఎక్కువుగా ఉంది. వ్యాధి నిర్ధారణకు ఆసుపత్రులకు తాకిడి పెరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, జిల్లా కేంద్రాసుపత్రి, సీహెచ్‌సీ ఆసుపత్రుల నుంచి నమూనాలు సేకరించి టీ డయాగ్నొస్టిక్ హబ్‌కి పంపిస్తున్నారు. అక్కడ డెంగీని నిర్ధారించే ఎలీసా పరీక్షలను ప్రతి రోజు 100 నుంచి 150 వరకు చేస్తున్నారు. జులైలో రెండు కేసులు రాగా ఆగస్టులో 102 నమోదయ్యాయి. కిట్‌లో పాజిటివ్ వచ్చిన వాటిని తప్పకుండా ఎలీసా ద్వారా నిర్ధారిస్తున్నారు. డెంగీ తీవ్రత కారణంగా రెండు మరణాలు సంభవించాయి. ఈ నెల 13న డెంగీతో ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన 33 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. డెంగీ లక్షణాలున్న ఇద్దరు భువనగిరి వైద్యకళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పారిశుద్ధ్యం లోపించడంతో..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డెంగీ వ్యాధికి కారకమైన దోమలు విజృంభించడంతో వ్యాధి వ్యాప్తి ఎక్కువగానే ఉంది. వర్షాల వల్ల నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నా కేసుల సంఖ్య తగ్గడం లేదు. డెంగీ దోమలు పెరిగేందుకు కారణమయ్యే మంచినీటి నిల్వలు, తాగేసిన కొబ్బరి బొండాలు ఖాళీ సీసాలు, పూలకుండీలు, పాతటైర్లు అలాగే వదిలేయడంతో సమస్య తీవ్రమవుతోంది. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్యం లోపించడం, బ్లీచింగ్, ఫాగింగ్ చర్యలు నామామాత్రంగా ఉండటంతో దోమల వృద్ధి పెరిగింది.

లక్షణాలు ఉంటే తాత్సారం చేయొద్దు

డెంగీ సాధారణ జ్వరంగా మొదలువుతుంది. 100 నుంచి 104 ఫారన్‌హీట్ డిగ్రీల వరకు జ్వరం ఉంటుంది. చలి, వణుకు, తీవ్రమైన తలనొప్పి, కంటి వెనుక భాగంలో నొప్పి, ఒళ్లు నొప్పులు, నడుమునొప్పి, శరీరంపై దద్దుర్లు కనిపిస్తాయి. రెండు మూడు రోజులకు మించీ ఈ లక్షణాలు ఉంటే డెంగీ జ్వరంగా భావించాలి. తప్పనిసరిగా ఆసుపత్రికి వెళ్లి వైద్యుడి సూచనల మేరకు నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సాధారణ జ్వరాన్ని డెంగీ జ్వరంగా భావించి హైరానా పడొద్దని సొంత వైద్యం కాకుండా ఆసుపత్రుల్లో చూపించుకోవాలని చెబుతున్నారు. వైద్యులు సలహా లేకుండా యాంటిబయాటిక్స్ వాడొద్దని హెచ్చరిస్తున్నారు.

పరీక్షలు చేయించుకోవాలి

– డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, వైద్యకళాశాల ఆసుపత్రి

డెంగీ జ్వర లక్షణాలు ఏమాత్రం ఉన్నా ఆరోగ్య కేంద్రంలోని వైద్యుడిని సంప్రందించి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి పాజిటివ్ అని తేలినా హైరానా పడొద్దు. డెంగీ వచ్చినప్పుడు ప్లేట్‌లెట్స్ కౌంట్ పడిపోవడం సర్వసాధారణం. కౌంట్ సంఖ్య చూసి ఆందోళనకు గురికావొద్దు.

# అధికారుల అండతో వక్ఫ్‌భూముల ఆక్రమణ

నీలగిరి: ఆధ్యాత్మిక సంస్థల నిర్వాహణకు దాతలు భక్తితో అప్పగించిన భూములను కొంతమంది ఆక్రమణదారులు అడ్డగోలుగా కబ్జా చేస్తున్నారు. ఆక్రమిత భూములను కూడా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో వక్ఫ్‌బోర్డు పరిధిలో అయిదు వేల ఎకరాల మెట్ట, తరి భూములు 70శాతానికి పైగా ఆక్రమణలో ఉన్నాయని ప్రచారం ఉంది. దర్గాలు, మజీదులు, పీర్ల కొట్టాల నిర్వహణ కోసం ఎంతో మంది దాతలు సహృదయంతో దానం ఇచ్చిన భూములను ప్రభుత్వం, వక్ఫ్‌బోర్డు కాపాడుకోలేక పోతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన పట్టణాల్లోనే నిరంతరాయంగా గుట్టలను చీల్చి నివాసాలు ఏర్పాటు చేసుకుంటుంటే.. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితిని ఊహించుకోవచ్చు.నల్గొండ పట్టణంలోని లతీఫుల్లా షా ఖాద్రీ దర్గాకు చెందిన 540 ఎకరాల భూమి (దర్గా ఉన్న గుట్ట)ని కొన్నేళ్లుగా కొందరు ఇనాం భూమి అంటూ అమ్ముకుంటున్నారు. అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిని బెదిరించి రాజీ కుదుర్చుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ భూముల ఆక్రమణలపై



అనేక కథనాలు ప్రచురించింది. లతీఫ్ షా ఖాద్రీ దర్గా భూములను ఆక్రమించుకున్న వారిపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసు విచారణలో ఉన్నా.. దర్గా భూముల ఆక్రమణలు ఆగడంలేదు. నల్గొండ దేవరకొండ, భువనగిరి తదితర ప్రాంతాల్లోని దర్గా భూములను ఆక్రమించుకున్నారు. గుట్టలను ఆక్రమించి మట్టి, రాళ్లు, భూములు అమ్మేసుకుంటున్నారు. అధికారంలోకి వస్తే.. ఆ పార్టీ నాయకులతో అంటకాగుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నారనే ప్రచారం ఉంది.

మదీనా మజీద్ కమిటీపై కేసునమోదు..

వక్ఫ్‌బోర్డుకు చెందిన భూముల్లో నిర్మించిన భవనాలకు అద్దె కమిటీకి చెల్లించాలని, వక్ఫ్‌బోర్డుకు ఇస్తామనే వాదన కిరాయిదారుల మధ్యన జరుగుతుంది. ఈ వివాదం పోలీసుల వద్దకు చేరింది. అద్దెకోసం కమిటీ సభ్యులు వేదిస్తున్నారనే ఫిర్యాదుతో ఇటీవల టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వక్ఫ్ అధికారులు సకాలంలో స్పందిం చకపోవడం వల్లనే కమిటీ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని కిరాయిదారులు బోర్డు ఛైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆక్రమించి నివాసాలుగా ఏర్పాటు ..

వక్ఫ్‌బోర్డుకు చెందిన భూముల్లో పక్కా భవనాలు నిర్మించుకుని వ్యాపారాలు నిర్వహిస్తూ, నివాసాలు ఏర్పాటు చేసుకున్నా.. సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకున్నది లేదు. నల్గొండ పట్టణంలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన భూమిలో విద్యాసంస్థల భవనాలు, వ్యాపార సముదాయాలు, 1000 పైగా నివాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది. దేవరకొండలోనూ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించినా ఎలాంటి చర్యలు తీసుకోలేక పోతున్నారు.విచారించి చర్యలు తీసుకుంటాం..

–అహ్మద్, వక్ఫ్ ఇన్‌స్పెక్టర్జిల్లాలో వక్ఫ్‌బోర్డు పరిధిలో భూములను ఆక్రమించిన చోట విచారించి చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరతతో సకాలంలో విచారించలేక పోతున్నాం. పట్టణాల్లో ఆక్రమించి నివాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకున్న వాటిని గుర్తించి నోటీసులిచ్చాం. లతీఫ్ షా ఖాద్రీ దర్గాకు చెందిన భూముల ఆక్రణమణపై ఇప్పటికే కేసు నమోదయింది. బినామీ కమిటీ పేరుతో ఆక్రమించుకుని సంస్థ ప్రమేయం లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం.

# పుస్తకాలకూ.. పరీక్షే!

వికారాబాద్ : పోటీ పరీక్షలొస్తున్నాయంటే నిరుద్యోగులు సమీప గ్రంథాలయాలకు (లైబ్రరీలు) వెళ్తుంటారు. కొందరు ఇళ్లకు తీసుకువెళ్తారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్మీ, నేవీ, స్టాఫ్ సెలక్షన్, గ్రూప్స్, పోలీసు, వైద్య, తదితర విభాగాల్లో నోటిఫికేషన్లు విడుదల చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని వెలువడ్డాయి. ఆర్థికంగా ఖర్చు పెట్టగలిగిన వారు హైదరాబాద్ వెళ్లి హాస్టల్‌లో ఉంటూ శిక్షణ పొందుతారు. కానీ పూర్తి గ్రామీణ ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలో అంత ఖర్చు చేయగలిన వారు చాలా తక్కువ. అందుకే అధిక శాతం సమీప లైబ్రరీలపైనే ఆధారపడుతున్నారు. కానీ జిల్లాలోని లైబ్రరీల్లో తగిన స్థాయిలో పుస్తకాలు లేవని నిరుద్యోగులు వాపోతున్నారు.

**365 రోజులు తెరిచే ఉంటుంది**

వికారాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం 365 రోజులు తెరచి ఉంచుతున్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పనిచేస్తుంది. ఇదొక్కటే కాదు తాండూరు, పెద్దేముల్, పరిగి గ్రంథాలయాలు కూడా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తున్నాయి. జిల్లాలో పాఠకులు వారికి అవసరమైన పుస్తకం గ్రంథాలయంలో దొరకనప్పుడు వెంటనే గ్రంథ పాలకుడిని కలిసి ఫలానా పుస్తకం కావాలని అని తెలిపితే వారంలో తెప్పిస్తున్నారు.

**సమస్యల వలయం**

తాండూరులోని శాఖా గ్రంథాలయం సమస్యల వలయంగా మారింది. ఇక్కడ పాఠకులకు పూర్తి స్థాయిలో వసతులు లేక పోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంతో పాటు నియోజక వర్గంలోని



మండలాల యువతకు ఇక్కడకు వస్తుంటారు.

**ఉచిత శిక్షణ తరగతులకు గతంలో నేతల చొరవ**

పరిగి, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం గ్రూప్స నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసినప్పుడు పరిగి, తాండూరు, వికారాబాద్ పట్టణ కేంద్రాల్లో ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా ఉచిత శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి నిపుణులను పిలిపించి తరగతులు నిర్వహించారు. భోజనంతోపాటు పుస్తకాలు కూడా అందించారు. వీటివల్ల గ్రామీణ యువతకు కొంత మేరైనా మేలు చేకూరింది. ఈసారి కూడా అదే తరహాలో శిక్షణ తరగతులు ఏర్పాటుచేసి చేయూత నివ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

**జిల్లాలో గ్రంథాలయాల సమాచారం**

జిల్లా కేంద్ర గ్రంథాలయం: 1 (వికారాబాద్)
గ్రేడ్ 2: 2 (తాండూరు, పరిగి)
గ్రామీణ గ్రంథాలయాలు: 17
అన్నింటా పుస్తకాలు : 3.40 లక్షలు
జిల్లా గ్రంథాలయంలో : 83 వేలు
పోటీ పరీక్షలకు సంబంధించినవి : 11 వేలు
నిత్యం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చే పాఠకులు: 200 మందికి పైగా..

**క్లర్క్ నుంచి కలెక్టర్ పోస్ట్ వరకు సాధన పుస్తకాలున్నాయి**

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో క్లర్క్ నుంచి కలెక్టర్ పోస్టు సాధన వరకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. నెట్ కనెక్షన్‌లో ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు ఉచితంగా నెట్ సౌకర్యాన్ని వాడుకోవచ్చు. రాత్రి పూట ప్రత్యేకంగా సెక్యూరిటీ గార్డును కూడా ఏర్పాటు చేశాం. - పి.సురేశ్‌బాబు, కార్యదర్శి గ్రంథాలయ సంస్థ, వికారాబాద్.

# పత్తి కొనుగోళ్లకు కసరత్తు

నల్గొండ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి దిగుబడులు మొదలు కావడంతో కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) కసరత్తు చేస్తోంది. రైతులు తీసుకువచ్చిన సరకును ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వ్యాపారులు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో గత రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మొగ్గు చూపలేదు. కేంద్రం ఈ ఏడాది పొడువు గింజ పత్తి క్వింటాకు రూ.7,521, మధ్యస్థ గింజ పత్తికి క్వింటాకు రూ.7,121గా మద్దతు ధరలను ప్రకటించింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో క్వింటాలు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతోంది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఇప్పుడు సుమారు రూ.2 వేల వరకు ఎక్కువ ఉండటంతో రైతులు బహిరంగంగానే అమ్మడానికి మొగ్గు చూపుతున్నారు. అయితే కొనుగోళ్లు మొదలైన తర్వాత వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తే రైతులు నష్టపోతారన్న ఉద్దేశంతో తొలి దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చండూరు, మునుగోడు, నల్గొండ, దేవరకొండ, కొండమల్లేపల్లి, సూర్యాపేట, భువనగిరి, తిరుమలగిరి, ఆలేరు, నాంపల్లి లాంటి ప్రాంతాల్లో కేంద్రాల ఏర్పాటుకు సీసీఐ మొగ్గు చూపుతోంది. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి 50కి పైగా జిన్నింగ్ మిల్లులుండగా.. ఆయా జిల్లాల కలెక్టర్లు అధ్యక్షతన మార్కెటింగ్, తూనికలు, కొలతలు, వ్యవసాయ శాఖలకు చెందిన అధికారులు ఈ కేంద్రాల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారు. వచ్చే నెల మొదటి నుంచి దిగుబడులు రానున్న నేపథ్యంలో ఇప్పటికే కొనుగోళ్లకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఎక్కడెక్కడ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న విషయంపై నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**7.18 లక్షల ఎకరాలు... 65 లక్షల క్వింటాళ్లు**

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో మూడు జిల్లాల్లో కలిపి 7,18,765 ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. ఇది గతేడాది కంటే 60 వేల ఎకరాలు తక్కువ. గతేడాది నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి 7.82 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ పత్తి పంట బాగుంది. ఇటీవలి వర్షాలకు సూర్యాపేట జిల్లాల్లో కొంత దెబ్బతిన్నా ఉమ్మడి జిల్లాలో ఎకరాకు సగటున 8 క్వింటాళ్ల నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. మునుపటి కంటే ఈ ఏడాది పత్తి పైరు ఎదుగుదల బాగుందని.. చీడపీడల బెడద సైతం తగ్గిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దిగుబడులు 65 లక్షల క్వింటాళ్ల వరకు ఉండొచ్చన్న అంచనాలున్నాయి.

**ఏర్పాట్లు చేస్తున్నాం - ఛాయాదేవి, ఏడీ, మార్కెటింగ్ శాఖ, నల్గొండ జిల్లా**

పత్తి కొనుగోళ్లకు సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే తక్కువకు రైతుల నుంచి కొనుగోళ్లు చేయకుండా వ్యాపారులపై నిఘా పెట్టాం.

# పోడు ఆశ.. అడవితల్లికి గుండెకోత



రుద్రంగి: జీవనోపాధి లేని నిరుపేద గిరిజన, గిరిజనేతరులకు ప్రభుత్వం పోడు భూములపై హక్కులను కల్పించింది. ఇప్పుడు ఇదే అటవీ భూముల అన్యాక్రాంతానికి కారణమవుతోంది. శత వసంతాలు విరాజిల్లిన వృక్షరాజాలు, కనువిందు చేసే పచ్చని చెట్లు కోత మిషన్ల ధాటికి కనుమరుగవుతున్నాయి. వన్యజీవులకు ఆవాసంగా ఉన్న ప్రాంతం నేడు చెట్లు లేక వెలవెలబోతోంది.

రుద్రంగి మండల కేంద్రం, మండలంలోని ఉమ్మడి మానాలలో దశాబ్దం నుంచి సుమారు 4 వేల ఎకరాల అటవీ ప్రాంతం ప్రస్తుతం పంట చేలుగా మారింది. అటవీ ప్రాంతం చదును చేసే ఇంకా ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. 2023లో అప్పటి భారాస ప్రభుత్వం సుమారు 1,700 ఎకరాల పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసింది. ఈ హక్కులు తమకు కూడా వర్తిస్తాయనే ఉద్దేశంతో నిత్యం కోత మిషన్లతో చెట్లను నేల కూల్చుతున్నారు.

రుద్రంగి- మానాల అటవీ ప్రాంతంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వందలాది చెట్లను కోత మిషన్లతో కోస్తూ, ట్రాక్టర్లతో చదును చేస్తున్నారు. సహజ అడవులు పునరుద్ధరణలో భాగంగా మానాల-భీంగల్ మధ్య రెండు దశాబ్దాల క్రితం పెంచిన నీలగిరి చెట్లను సైతం ఇటీవల అక్రమార్కులు నరికేశారు.

ఉమ్మడి మానాలలో కొందరు సుమారు 30 నుంచి 50 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించినా వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొందరు ప్రజాప్రతినిధులు జిల్లా అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడు లేదు.

రుద్రంగికి అనుబంధంగా ఉన్న కొచ్చెగుట్ట తండా, గువ్వల బండా తండా, దసరానాయక్ తండా పరిసరాల్లో వందలాది ఎకరాల అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి.

**ఇలా చేస్తే మేలు..**

అటవీ ప్రాంతాల్లోకి చదును చేసే వాహనాలు వెళ్లకుండా కందకాలు తవ్వాలి. అన్ని సామాజిక వర్గాలతో అటవీ పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి.

ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో పండ్ల మొక్కలు నాటితే కోతులు మళ్లీ అడవి బాట పట్టేందుకు అవకాశం ఉంటుంది.

ఈ చిత్రంలో కనిపిస్తున్నది 2021-22లో కంపా పథకంలో భాగంగా సహజ అడవుల పునరుద్ధరణ పేరిట 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. 2022లో అటవీ భూమి కోతకు గురికావద్దని, వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు, భూగర్భ జలాల పెంపు కోసం మూడు నీటి కుంటలను నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ 50 ఎకరాల్లో పత్తి చేను దర్శనమిస్తోంది.

**జనాల్లోకి వన్యప్రాణులు**

అటవీ ప్రాంతం నానాటికీ క్షీణించడంతో సురక్షితమైన ప్రాంతాలు కరవై వన్యప్రాణులు జనావాసాలు, పంట చేలల్లోకి వస్తున్నాయి. చిరుతలు, ఎలుగుబంట్లు, మనుబోతులు, కోతులు, దుప్పిలు, జింకలు, నెమళ్లు వంటివి పంట పొలాల్లోకి తరచూ వస్తున్నాయి.

**కేసులు నమోదు చేస్తున్నాం**

మా పరిధిలో అడవుల అన్యాక్రాంతానికి సంబంధించిన కారకులను పట్టుకుని కేసులు పెడుతున్నాం. కొందరిని బైండోవర్ చేశాం. మా సిబ్బంది ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇతర శాఖలు, ప్రజాప్రతినిధుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉంది.రాఘవేందర్‌రావు, డిప్యూటీ రేంజ్ అధికారి, చందుర్తి

నిఘా పెట్టాంమా సామర్థ్యం మేర అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు నిఘా ఉంచాం. ప్రజల మద్దతు ఉంటేనే అడవుల రక్షణ పూర్తిగా సాధ్యమవుతుంది. మానాల-భీంగల్ మధ్యలో ఆక్రమణలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశాం. కొందరిని ఇంకా గుర్తించాల్సి ఉంది.గౌసొద్దీన్, సెక్షన్ అధికారి, భీంగల్

# ఆధునిక యంత్రం.. ఉపాధి అంతంతమాత్రం



సిరిసిల్ల: ఏళ్ల తరబడి ఒకే వృత్తిని నమ్ముకుని ఉండటం.. అందులోనూ డిటర్జంట్లు.. రసాయనాలు కలిసిన నీళ్లతో దుస్తులు ఉతకడంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. దీని ప్రభావంతో చాలా కుటుంబాలు రజక వృత్తికి దూరమవుతున్నాయి. పైగా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాక వీరికి ఉపాధి కూడా కరవవుతోంది. దీంతో చాలా మంది యువకులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రజకుల్లో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఆధునిక ధోబీఘాట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆశయం మంచిదే అయినా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు.

**కొరవడిన ప్రచారం**

రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా సిరిసిల్ల పట్టణంలో రూ.1.38 కోట్లతో ఆధునిక ధోబీ ఘాట్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో రోజుకు రెండు షిఫ్టుల్లో 16 సైకిల్స్‌లో 3,840 దుస్తులు ఉతికి, ఆరేసి, ఇస్త్రీ చేసే వీలుంది. దీని పరిధిలో 30 కుటుంబాలకు నిరంతర ఉపాధి లభిస్తుంది.ప్రస్తుతం రెండ్రోజులకు ఒకసారి కూడా ఒక షిఫ్టునకు పూర్తిగా సరిపడినన్ని దుస్తులు రావడం లేదు. విస్తరిస్తున్న సాంకేతికత ఓవైపు.. అందుకు తగ్గట్లుగా ప్రచారమూ కొరవడటంతో రజకుల ఉపాధిపైన ప్రభావం చూపుతోంది. ఇక్కడ పూర్తిస్థాయి లక్ష్యం చేరుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా మరో 18 చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.

వీటి నిర్వహణకు రాష్ట్రంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. కానీ అవి కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలైన వసతి గృహాలు, గురుకులాలు, ఆసుపత్రులు, లాడ్జీల్లో వస్త్రాలు తీసుకొచ్చి ఉతికి ఇచ్చేలా ధోబీఘాట్‌పై ప్రచారం చేయలేదు. రజకులకు పని భారం తగ్గడంతోపాటు తక్కువ సమయంలో ఎక్కువ దుస్తులు ఉతికి ఉపాధిని మరింతగా విస్తరించుకునే అవకాశాలు అందిపుచ్చుకోవడం లేదు.

**అధికారుల సహకారం అవసరం**

తరతరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి. గురుకులాలు, కళాశాలకు వెళ్లి దీనిపై వివరించాం. వాటిలో పని చేసేవారికి ఆధునిక ధోబీ ఘాట్ సామర్థ్యం గురించి చెప్పాం. వారే నేరుగా దుస్తులు తీసుకొచ్చి ఉతుక్కొని తీసుకెళ్లవచ్చు. వారికి ఉపాధి గిట్టుబాటయ్యేలా మాట్లాడుతామని చెప్పాం. జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలలు, వసతి గృహాలు ఈ ధోబీఘాట్‌ను వినియోగించేలా అధికారులు సహకరించాలి.కాసర్ల లక్ష్మయ్య, రజక సంఘం అధ్యక్షుడు

# పల్లెల్లో స్వచ్ఛతా హీ సేవా

రాజపేట : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో వీధులు పిచ్చిమొక్కలకు, దోమలకు నిలయంగా మారాయని చెప్పవచ్చు. ఫలితంగా జ్వరాలతో పల్లెలు విలవిలలాడుతున్నాయి. దీన్ని నిలువరించే క్రమంలో పక్షం రోజుల పాటు ప్రభుత్వం పల్లెల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. ముఖ్యంగా 'మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణతోనే స్వచ్ఛ గ్రామాలుగా రూపుదిద్దుకుంటాయని' మహాత్మాగాంధీ ఆనాడే చెప్పిన విషయం తెలిసిందే. ఆ మహాత్ముని జయంతి వేడుకల సందర్భంగా ప్రతి పంచాయతీల్లో స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన అంశాల వారీగా నిర్వహించడానికి సంబంధిత అధికారులు సన్నద్ధమవుతున్నారు.

**పారిశుద్ధ్య చర్యలకు ప్రాధాన్యం**

ఉమ్మడి జిల్లాలోని పల్లెల్లో 15 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధాన కూడళ్లు, ప్రజోపయోగ స్థలాలు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చెత్త, మురుగును తొలగించనున్నారు. స్వచ్ఛంద సంస్థలు, యువన సంఘాలు, ప్రజల శ్రమదానంతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని నిర్ణయించారు. కంపోస్టు షెడ్‌లలో తడి, పొడి చెత్త వేరు చేయాలి. చెత్త నుంచి ప్లాస్టిక్, గాజు, ఇతర వస్తువులను వేరు చేయాలి. మిగిలిన తడిచెత్త వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చాలి. చివరి రోజైన అక్టోబరు 2న నిర్వహించే గ్రామసభల్లో ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ప్రత్యేక తీర్మానాలు చేయాలి. వస్త్ర సంచులు వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

స్వచ్ఛత ప్రాధాన్యంపై విద్యాలయాల్లో క్విజ్ పోటీల నిర్వహణ, విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలి.

# బాహ్య వలయం.. అయోమయం

తాండూరు : వాణిజ్య ప్రాంతంగా పేరొందిన తాండూరుకు ఎనిమిదేళ్ల క్రితం తొలిసారిగా బాహ్యవలయ రహదారి మంజూరైంది. భారీ వాహనాలన్నీ ఇదే మార్గంలో వెళ్లేందుకు అవకాశం కలుగుతుందని, ట్రాఫిక్ సమస్యలు తీరడంతోపాటు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అంతా సంబురపడ్డారు. కానీ సంవత్సరాలు గడిచినా రహదారి నిర్మాణం పూర్తి కాలేదు. పూర్తి చేసిన దారిలో వాహనాల ప్రయాణాన్ని ప్రారంభికపోవడంతో లక్ష్యం నెరవేరడంలేదు. వెరసి నియోజకవర్గంలో 3లక్షల మందికి అవస్థలు తప్పడం లేదు.

**2016లో మంజూరు**

జిల్లాలో మొదటిసారి తాండూరుకు 2016లో బాహ్యవలయ రహదారి మంజూరైంది. తాండూరు మండలం గౌతాపూర్ శివారులో తాండూరు గ్రామీణ సీఐ కార్యాలయం పక్కన జాతీయ రహదారి నుంచి చెంగోల్, అంతారంతండా, భూకైలాష్, అంతారం, ఖాంజాపూర్ గేటు, యాలాల మండలం రాజీవ్ గృహకల్ప, బషీర్‌మియా తండా, రాశులపురం శివారులో జాతీయ రహదారికి అనుసంధానంగా నిర్మాణం పూర్తి చేసేందుకు పనులు చేపట్టారు. గౌతాపూర్ శివారు నుంచి ఖాంజాపూర్ గేటు వద్ద హైదరాబాద్ రహదారి పనులకు రెండు వరసల్లో తారు పనులు పూర్తయ్యాయి.



**పట్టణం, పరిసర గ్రామాల్లోకి రాకుండా..**

నిర్మాణం పూర్తయిన వరకు బాహ్యవలయ రహదారిని అందుబాటులోకి తెస్తే మల్కాపూర్, కొత్లాపూర్, కోటబాస్పల్లి, సంగెంకలాన్, జినగుర్తితో పాటు సరిహద్దునున్న కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చే వాహనాలు, సిమెంటు, నాపరాయి లారీలు, ట్యాంకర్లు పట్టణంలోకి ప్రవేశించకుండా బాహ్యవలయ రహదారి మీదుగా వెళ్లేందుకు ఆస్కారముంటుంది.

**నత్తనడకన పనులు**

బషీర్‌మియాతండా నుంచి రాశులపురం వరకు చేపట్టిన పనులు రహదారులు భవనాల శాఖ అధికారుల అలసత్వంతో మూడు సంవత్సరాలు దాటినా పూర్తి కాలేదన్న విమర్శలొస్తున్నాయి. 5 కి.మీ. మార్గంలో మట్టి, కంకర పనులకే పరిమితం చేశారు. తారు పనులు పూర్తి చేయించి అందుబాట్లోకి తెస్తే మహబూబ్‌నగర్ నుంచి వచ్చే వాహనాలు పట్టణంలోకి ప్రవేశించకుండా నేరుగా బాహ్యవలయ రహదారిగుండా వెళ్లేందుకు తోడ్పడుతుంది.

**పరిహార సమస్య పరిష్కరిస్తేనే అందుబాటు**

అంతారం తండా వద్ద కొద్ది దూరం తారు పనులు మినహా మిగిలి దారి నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర గడుస్తోంది. కొందరు రైతులు పరిహారం అందించలేదంటూ పేచీ పెట్టారు. వీరి సమస్యను పరిష్కరిస్తే తాండూరు-చించోళి మార్గం నుంచి హైదరాబాద్ రహదారి వరకు 8 కి.మీ. బాహ్యవలయ రహదారి అందుబాటులోకి తెచ్చే వీలుంటుంది.

బాహ్యవలయ రహదారి: 13 కి.మీ.
మంజూరైన నిధులు: రూ.78కోట్లు
ఖర్చు చేసింది: రూ.39కోట్లు

# ఎయిర్‌టెక్ అక్రమాలకు జీపీఎస్ కళ్లెం!

హైదరాబాద్ : గ్రేటర్ పరిధిలోని ఎయిర్‌టెక్ యంత్రాల పనితీరుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకు జలమండలి సిద్ధమైంది. ప్రతి యంత్రం ఎక్కడ ఉంది.. ఎలా పనిచేస్తుందో లెక్కలు తేల్చాలని ఎండీ అశోక్‌రెడ్డి నిర్ణయించారు. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్)తో ఈ యంత్రాలను అనుసంధానించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధాన నగరంతోపాటు శివార్ల మున్సిపాలిటీల్లో మురుగు నీటి నిర్వహణ జలమండలి పరిధిలో ఉంది. 2016 నుంచి పారిశుద్ధ్య కార్మికులు మ్యాన్‌హోళ్లలోకి దిగకుండా నిషేధించింది. మాన్యువల్ క్లీనింగ్ నుంచి యంత్రాలకు మారింది. దేశంలోనే మొదటిసారిగా 2017లో మినీ సివర్ జెట్టింగ్ యంత్రాలను ఆవిష్కరించింది. ప్రస్తుతం గ్రేటర్‌వ్యాప్తంగా పెద్ద, చిన్న యంత్రాలు కలిపి 225వరకు అందుబాటులో ఉన్నాయి. వీటికి ఏటా రూ.15 కోట్ల వరకు అద్దెగా బిల్లులు చెల్లిస్తున్నారు.నగరంలోని వివిధ ప్రాంతాల్లో మురుగు పొంగడంపై జలమండలి కస్టమర్ కేర్‌కు నెలకు 30-40 వేల ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ యంత్రాలతో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తున్నారు. చాలా ప్రాంతాల్లో 2-3 రోజులకు కూడా ఈ యంత్రాలు రావడం లేదంటున్నారు. యంత్రాలు అందుబాటులో లేక స్థానిక సిబ్బంది కర్రలను ఉపయోగించి మ్యాన్‌హోళ్లలో మురుగు కదిలేలా చేస్తున్నారు. ఒక్కో డివిజన్‌కు నాలుగు వంతున యంత్రాలను కేటాయించినా ఆయా



ప్రాంతాల్లో క్లీనింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి ఎయిర్‌టెక్ యంత్రం నిత్యం 500 రన్నింగ్ మీటర్ల వరకు మురుగు గొట్టాలు, మ్యాన్‌హోళ్లు శుభ్రం చేయాలి. ఆ స్థాయిలో పనులు జరగడం లేదు.

**సాంకేతిక నిఘా**

ఇక నుంచి ప్రతి ఎయిర్‌టెక్ యంత్రానికి జీపీఎస్ పరికరాలను అమర్చి ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించనున్నారు. కొన్ని యంత్రాలు ప్రైవేటు వ్యాపార, వాణిజ్య సంస్థల వద్దకు వెళ్లి మురుగు శుభ్రం చేస్తున్నాయి. యంత్రాల్లో కొన్ని రాజకీయ నాయకులకు అనుచరుల ఉన్నాయి. జీపీఎస్‌తో ఇలాంటి వాటికి చెక్ పెట్టవచ్చని చెబుతున్నారు. నగరంలో ఇంకా నిజాం నాటి మురుగు, పైపులైన్ల వ్యవస్థే ఆధారం. చాలా ప్రాంతాల్లో మురుగునీటి పైపుల కిందనుంచి మంచినీటి పైపులు వెళుతున్నాయి. లీకేజీలతో మురుగు నీరు మంచి నీటి పైపుల్లోకి చేరి.. కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయి. మురుగు గొట్టాల క్లీనింగ్ అత్యంత అవసరం కానున్న దృష్ట్యా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నారు.

# ఓఆర్ఆర్ వరకు మురుగు శుద్ధి

హైదరాబాద్: అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించిన స్థానిక సంస్థల (యూఎల్‌బీ)ల్లో మురుగు శుద్ధికి మార్గం సుగమం అయింది. గ్రేటర్ నుంచి ఓఆర్ఆర్ మధ్య 39 మురుగు శుద్ధి కేంద్రాల(ఎస్టీపీలు) నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రూ.3,849.1 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. అమృత్ 2.0 పథకంలో కేంద్రం 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 35 శాతం, హైబ్రిడ్ యాన్యుటీలో 40 శాతం నిధులు వెచ్చించనున్నారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఈ 40 శాతం నిధులు తొలుత భరించాలి. ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్ణీత కాల వ్యవధిలో ప్రభుత్వం వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తుంది. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా చేపడుతున్న 31 ఎస్టీపీలను ఈ విధానంలోనే చేపడుతున్నారు. అవుటర్ రింగ్‌రోడ్డు పరిధిలో నిర్మించే మురుగు శుద్ధి కేంద్రాలకు సంబంధించి జలమండలి మరోసారి ఇదే విధానం ఎంచుకుంది. ఇందులో ఒక ప్రాజెక్టును మాత్రం రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపడతారు.మూసీ ప్రక్షాళనలో భాగంగా..

972 మిలియన్ లీటర్ల శుద్ధి సామర్థ్యంతో కొత్త ఎస్టీపీలను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే అక్టోబరు నాటికి నగర వ్యాప్తంగా ఇప్పటికే



ప్రారంభించిన 31 ఎస్టీపీల్లో మురుగు శుద్ధి ప్రారంభం కానుంది. దీనికి మరో 1,250 మిలియన్ లీటర్లు అదనంగా శుద్ధి చేయనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 2,000 మిలియన్ లీటర్ల వరకు నిత్యం మురుగు ఉత్పత్తి అవుతుండగా...పాత, కొత్త ఎస్టీపీలతో కలిపి 100 శాతం మురుగు శుద్ధి సాధ్యం కానుంది. ప్రస్తుతం ఎస్టీపీల్లో శుద్ధి చేయని మురుగులో 80 శాతం మూసీలో కలుస్తుండగా...మరో 20 శాతం స్థానిక చెరువుల్లోకి చేరుతోంది. ఫలితంగా గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువులు కలుషితమయ్యాయి. ఇలాంటి పరిస్థితిలో మూసీని ప్రక్షాళన చేయడం సవాలే. ప్రతి మురుగు చుక్కను శుద్ధి చేశాకే మూసీలోకి విడిచిపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అవుటర్ పరిధిలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఉత్పత్తి అయ్యే మురుగును కొత్త ఎస్టీపీల్లో శుద్ధి చేస్తారు. అనంతరమే మూసీలోకి విడిచిపెట్టనున్నారు. త్వరలో వీటికి సంబంధించిన టెండర్లను పిలవనున్నట్లు జలమండలికి చెందిన ఓ అధికారి తెలిపారు.

# పసిగట్టేస్తాం.. పట్టేస్తాం

హైదరాబాద్: పోలీసులకు సవాలుగా మారుతోన్న సైబర్ నేరాలను మరింత సమర్థంగా ఎదుర్కోవడానికి సైబరాబాద్ పోలీసులు సిద్ధమవుతున్నారు. కొత్తగా ఐదు సైబర్‌క్రైమ్ ఠాణా ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కమిషనరేట్ పరిధిలో జోన్‌కు ఒకటి చొప్పున ఉండేలా కసరత్తు చేస్తున్నారు.ఆమోదం లభించాల్సి ఉంది.

**జోన్ల కేంద్రంగా పరిష్కారం**

ప్రస్తుతం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఒక సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఉంది. రూ.50 వేల కంటే తక్కువ పోగొట్టుకుంటే స్థానిక స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. అంతకుమించి అయితే సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ఈ ఠాణాలో 2024లో ఇప్పటివరకు 4935 కేసులు నమోదయ్యాయి. డబ్బు రికవరీ సగటున 20 శాతం మించడం లేదు.

నేరస్థుల అరెస్టులు సగటున 5 శాతం కూడా ఉండడం లేదు.

ఇతర రాష్ట్రాల్లో ఉండే నిందితుల్ని తీసుకురావడానికి వారాల తరబడి పనిచేయాల్సి వస్తోంది.

కేవలం ఒకే పోలీస్‌స్టేషన్ ఉండటంతో ఈ సమస్య వస్తోంది.

జోన్‌కి ఒకటి చొప్పున సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఉంటే.. సగటు కేసుల పరిష్కారం పెరిగే అవకాశముంటుంది.

**పెరుగుతున్న కేసులు**



రాష్ట్రంలో అత్యధికంగా సైబర్ నేరాలు నమోదయ్యే పోలీస్ యూనిట్లలో సైబరాబాద్ కమిషనరేట్ తొలిస్థానంలో ఉంది. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రానికి కీలకమైన ఐటీ కారిడార్‌తో పాటు అంతర్జాతీయ సంస్థలు సైబరాబాద్ పరిధిలో ఉన్నాయి. వీటికితోడు వివిధ రాష్ట్రాలకు చెందిన ఐటీ సంస్థలు ఇక్కడ ఉంటున్నాయి. ఫలితంగా కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. సైబరాబాద్‌లో 2023లో మొత్తం 5,342 కేసులు నమోదైతే.. ఈ ఏడాది తొలి ఏడునెలల్లోనే ఒక్క సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో 4,935 కేసులు నమోదయ్యాయి. స్థానిక పోలీస్‌స్టేషన్లలో రూ.50 వేల కంటే తక్కువ మొత్తాల్లో పోగొట్టుకున్న ఘటనల్లో నమోదయ్యే కేసులు అదనం. ఈ ఏడాదిలోపు ఈ సంఖ్య రెట్టింపయ్యే అవకాశముంది. ప్రస్తుతం రోజూ 24 కేసులు నమోదవుతున్నట్లు గుర్తించారు.

# పంట రుణం.. లక్ష్యానికి దూరం



హుజూరాబాద్ : ఉమ్మడి జిల్లాలో ఏటా వార్షిక రుణ ప్రణాళికను భారీగా ఖరారు చేస్తున్నా లక్ష్యానికి అనుగుణంగా రైతులకు అందటం లేదు. గత నాలుగేళ్ల గణాంకాలను పరిశీలిస్తే 72 శాతానికి మించి రైతులకు రుణాలు ఇచ్చిన దాఖలలు లేవు. ప్రతీ సీజన్‌లో రుణాల మంజూరులో బ్యాంకు అధికారులు కొర్రీలు పెడుతుండంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీంతో వారిపై వడ్డీ భారం పడుతోంది. పంట రుణమాఫీ చేస్తారనే ఆశతో రైతులు తమ బ్యాంకు ఖాతాలను రెన్యూవల్ చేసుకోలేదని.. అందుకే రుణాల లక్ష్యం పూర్తి కాలేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. గత నాలుగేళ్ల పంట రుణాల వార్షిక ప్రణాళిక లక్ష్యం.. ఇచ్చిన రుణాలపై కథనం.

**ఖాతాలు పునరుద్ధరించుకోకపోవడంతో..**

గత నాలుగేళ్లలో రుణ లక్ష్యాలు పరిశీలిస్తే ఈ ఏడాద్కైనా పూర్తవుతుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రుణాలు అందక రైతులు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ లాభాలు రాక.. అప్పులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,30,709 మంది రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేశారు. జులై 30న రూ.లక్షన్నర వరకు రుణమాఫీ నిధులు విడుదలయ్యాయి. ఆగస్టు 15న రూ.2 లక్షల వరకు రుణమాఫీ రైతులకు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా కొత్త రుణాలు ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. మరోవైపు నాబార్డు లక్ష్యాలకు అనుగుణంగా నిర్దేశించిన మేర రైతులకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. రుణమాఫీ పొందిన రైతులు తమ ఖాతాలను రెన్యువల్ చేసుకుని కొత్త రుణాలను పొందవచ్చని బ్యాంకు అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో బ్యాంకర్లు కొత్త రుణాలను మంజూరు చేస్తారనే ఆశలు అన్నదాతల్లో చిగురిస్తున్నాయి. ఈ ఏడాది లక్ష్యం రూ.8,034.26 కోట్లు

ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో 12.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నాబార్డు లక్ష్యాల మేరకు రూ.8,034.26 కోట్ల వార్షిక పంట రుణ లక్ష్యాన్ని అధికారులు ఖరారు చేశారు. వానాకాలం, యాసంగికి కలిపి(టర్మ్ లోన్స్ మినహా) కరీంనగర్ జిల్లాలో రూ.2,357.80 కోట్లు, జగిత్యాలలో రూ.2,292.60 కోట్లు, పెద్దపల్లిలో రూ.1,864.83 కోట్లు, సిరిసిల్లలో రూ.1,519.03 కోట్లు రైతులకు సాగు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు.

# ప్రగతి రథ చక్రం.. పర్యావరణ హితం



కరీంనగర్ : ఇంధన భారం తగ్గించుకోవడం, కాలుష్య నివారణతోపాటు ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఆర్టీసీ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతమున్న అద్దె బస్సుల తరహాలోనే ఎలక్ట్రికల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. జేబీఎం సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్టీసీకి ఇంధన భారం తగ్గనుంది. మరో వైపు మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. సరిపడా బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎలక్ట్రికల్ బస్సులు రోడ్డు ఎక్కనుండటంతో వారికి కాస్త ఉపశమనం కలుగుతుంది. కరీంనగర్ రీజియన్‌లో ఎలక్ట్రికల్ బస్సుల సేవలపై కథనం.

రీజియన్‌లోని కరీంనగర్-2 డిపోకు 70 ఎలక్ట్రికల్ బస్సులను కేటాయించారు. ఇప్పటికే మొదటి దశలో 33 కరీంనగర్‌కు చేరాయి. మిగతావి రెండో విడతలో వచ్చే అవకాశముంది. ప్రస్తుతం వచ్చినవన్నీ సూపర్‌లగ్జరీ బస్సులు కాగా రెండో దశలో ఎక్స్‌ప్రెస్‌లు రానున్నాయి. కరీంనగర్-2 డిపోలో ఎలక్ట్రికల్ బస్సులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్తు సబ్‌స్టేషన్ పనులు, షెడ్డు నిర్మాణం, బస్సుల ఛార్జింగ్ పాయింట్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. 14 ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తుండగా ఇప్పటికే 11 పూర్తయ్యాయి. అవసరమైన విద్యుత్తు సరఫరాకు ఆర్టీసీ ఇప్పటికే ఆ శాఖకు దాదాపు రూ.6 కోట్లు చెల్లించినట్లు సమాచారం. ఒక్కో బస్సు ఫుల్ ఛార్జింగ్ కావాలంటే మూడు గంటల సమయం పట్టే అవకాశం ఉంటుంది. ఒక్కసారి ఛార్జి చేస్తే 320కి పైగా కిలోమీటర్లు నడుస్తుందని తెలిసింది. ఆర్టీసీ అద్దె (హైర్) బస్సుల తరహాలోనే వీటిని తిప్పనున్నారు. జేబీఎం సంస్థతో ఒప్పందం కూడా జరిగింది. డ్రైవరు, విద్యుత్తు ఛార్జీలు, నిర్వహణ మొత్తం సంస్థే చూసుకుంటుంది. ఆర్టీసీ ఆ సంస్థకు కిలోమీటరుకు రూ.39-40 వరకు చెల్లించనుందని సమాచారం. కేవలం కండక్టర్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులకు టికెట్లు ఇచ్చి డబ్బులు వసూలు చేసే బాధ్యత తీసుకుంటుంది. టిమ్మూ డ్రైవర్ అయితే ఎలా అనే వ్యవహరించాలనే విషయంలో మాత్రం ఇప్పటికీ స్పష్టత రాలేదు. కరీంనగర్-2 డిపోకు వచ్చిన ఎలక్ట్రికల్ బస్సులలో 75 శాతం వరకు జేబీఎస్, హైదరాబాద్ రూట్‌లోనే నడిపే అవకాశం ఉందని, మిగిలిన వాటిని ఛార్జింగ్ కెపాసిటీని బట్టి ఇతర ప్రాంతాలకు నడిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఛార్జింగ్ పాయింట్లు, ఇతర అవసరమైన పనులు పూర్తికాగానే ఈ నెల చివరలో కాని సెప్టెంబరు మొదటి వారంలో కాని ఎలక్ట్రికల్ బస్సులు రోడ్డెక్కే అవకాశం ఉందని సమాచారం.

**త్వరలో ప్రారంభం**

మొదటి విడతలో భాగంగా 30 ఎలక్ట్రికల్ బస్సులు కరీంనగర్ చేరుకున్నాయి. మిగితావి త్వరలో వచ్చే అవకాశముంది. కరీంనగర్-2 డిపోలో ఛార్జింగ్ పాయింట్లు, షెడ్డు నిర్మాణం పూర్తి కావచ్చింది. త్వరలోనే వీటిని ప్రారంభిస్తారు. కంపెనీయే నిర్వహణ బాధ్యత చూసుకుంటుంది. విధి విధానాలు రాలేదు.

ఎస్.సుచరిత, ఆర్ఎం, కరీంనగర్ రీజియన్

# అంతటా చేసి.. ఇక్కడ వదిలేసి!



కరీంనగర్ : నగరంలో స్మార్ట్‌సిటీ, ఇతర నిధులతో రహదారులను బాగు చేయగా, వాహనాలు రయ్‌మని దూసుకెళ్తున్నాయి. కానీ అత్యంత ప్రాధాన్య కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్ వైపు వెళ్లు అంతర్గత అనుసంధాన రహదారిని మాత్రం విస్మరించారు. అటు వైపు ప్రయాణం చేసేవారు నరకయాతన పడుతున్నారు. ప్రత్యామ్నాయ దారులు వెతుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రాంతం ఎక్కడ ఉంది.. చేయాల్సిన పనులేమిటి? తదితర వివరాలతో కథనం.సమస్య : నగరంలోని 60 డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించేందుకు ముఖ్యమంత్రి హామీ నిధులు(సీఎంఏ) రూ.132 కోట్లతో గతేడాది అక్టోబరులో పనులు అట్టహాసంగా ప్రారంభించారు. కొన్ని డివిజన్లలో పనులు పూర్తి చేయగా మిగతా ప్రాంతాల్లో తవ్వి వదిలేశారు. అసంపూర్తి పనుల్లో కట్టరాంపూర్- కోతిరాంపూర్ రహదారి కూడా ఒకటి. రెండు కిలోమీటర్ల పొడవునా చేపట్టాల్సిన పనులు సగం మేర పూర్తి చేసి మిగతా భాగం వదిలేశారు. రోడ్డు పూర్తయిన చోట డ్రైనేజీలు అసంపూర్తిగా ఉన్నాయి.

**ఇబ్బందులు ఇలా**

వదిలేసిన ప్రాంతంలో రహదారి మొత్తం ఛిద్రమైంది. వర్షం పడితే చాలు గుంతలలో నీరు నిలిచి రాకపోకలు సాగించకుండా మారుతోంది. రెండు వైపులా మురుగుకాలువలు అధ్వానంగా మారాయి. అసంపూర్తిగా ఉన్నాయి. పది నెలలుగా పనులు చేయకపోవడంతో స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు.

**పని పూర్తయితే ప్రయోజనం**

భగత్‌నగర్, రాంపూర్ , దోబీవాడ, గణేశ్‌నగర్, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, కలెక్టరేట్ ప్రాంతం, ముకరంపుర తదితర కాలనీల నుంచి హైదరాబాద్ రోడ్డుకు వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఉపయోగపడుతుంది. అలాంటి రోడ్డుపై రాకపోకలు సాగించడం గగనంగా మారింది.

**ఫిర్యాదులు వస్తున్నా..**

కట్టరాంపూర్ వైపు రోడ్డు గుంతలు పడిందని ఆ ప్రాంతవాసులు, వివిధ రాజకీయ పార్టీలు ఫిర్యాదు చేస్తుండగా కనీసం పట్టింపులేకుండా పోయింది. నిత్యం రద్దీగా టెంపుల్ రోడ్డును నిర్మించకపోవడం పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతుంది. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి నిర్మించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.కట్టరాంపూర్ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభించే అవకాశముందని నగర పాలిక డీఈఈ ఓంప్రకాశ్ తెలిపారు. గుత్తేదారు వస్తే పనులు ఆగవు. రహదారి విస్తరణకు అడ్డంకులు ఉన్నాయన్నారు.

# విస్తరణ దిశగా.. జియో థర్మల్ ప్లాంట్!

మణుగూరు : మణుగూరులోని జియో థర్మల్ విద్యుదుత్పత్తి ప్లాంట్ విస్తరణపై కదలిక వచ్చింది. పగిడేరు గ్రామంలో 20 కేవీ సామర్థ్యంతో 2020లో కర్మాగారాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. భవిష్యత్తులో మెగావాట్ల సామర్థ్యం గల స్థాయికి ప్లాంట్ రూపాంతరం చెందే అవకాశం ఉంది.

సహజ సిద్ధంగా పైకి ఉబికి వచ్చే వేడి నీటి బుగ్గల నుంచి వందల మెగావాట్ల విద్యుదుత్పత్తికి అవకాశం ఉంది. దీనిపై పగిడేరులో సర్వే చేసేలా సింగరేణి, ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్), తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో) సంస్థల మధ్య తాజాగా ఒప్పందం కుదిరింది. ఫలితాలు సానుకూలంగా వస్తే వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తిని చేపట్టనున్నారు. అప్పటి వరకు ఓఎన్‌జీసికి సింగరేణి సంస్థ లాజిస్టిక్స్‌తో పాటు ఇతర సదుపాయాలు కల్పించనుంది. మరోవైపు 'రెడ్కో' సంస్థ ప్రభుత్వం నుంచి తగిన అనుమతులు తీసుకోనుంది. ప్లాంట్‌ను ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇంకా నిర్ణయానికి రాలేదు. విస్తరణ



జరిగితే మణుగూరు ప్రాంతం మరింత అభివృద్ధికానుంది.

**అనువైన వేడినీటి బుగ్గలు**

మణుగూరు పరిసర ప్రాంతాల్లోని భూమి పొరల్లో జియోలాజికల్ ట్రై జంక్షన్ కేంద్రీకృతమై ఉంది. భూమి పొరలలో రాపిడి వల్ల భూకంపాలు ఏర్పడటంతో పాటు వేడి నీరు ఉద్భవిస్తుంది. రేడియో యాక్టివిటీ మూలకాల కారణంగా ఆ నీటిలో ఉష్ణం మరింత పెరుగుతుంది. పగిడేరు ప్రాంతంలో ఇలాంటి వేడి నీటి ఊట 2 కి.మీ. లోతులో ఉందని ఓఎన్‌జీసీ గుర్తించింది. జియో థర్మల్ ప్లాంట్ ఏర్పాటుకు ఈ ప్రదేశం అనువైనదిగా పలు సర్వేల్లో తేల్చారు. 120 నుంచి 3400 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తి చేసేందుకు అనుకూలమైన ప్రదేశాలున్నాయని పలు పరిశోధన వ్యాసాల్లోనూ పేర్కొన్నారు. దీని ఆధారంగా ప్రాథమిక అంచనాకు వచ్చిన ఓఎన్‌జీసీ త్వరలో సర్వే చేపట్టనుంది.

"జియో థర్మల్ కేంద్రం ఏర్పాటుకు సింగరేణి నుంచి ఓఎన్‌జీసీకి పూర్తి సహకారం ఉంటుంది. సర్వేకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తాం. మణుగూరులో ప్లాంట్ విస్తరణకు అన్ని అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరిగితే భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం గ్రిడ్‌కు అనుసంధానించే అవకాశాలూ లేకపోలేదు."దుర్గం రామచందర్, జీఎం, మణుగూరు

# తెరపైకి రాష్ట్రీయ రహదారి ప్రతిపాదన

మణుగూరు : బూర్గంపాడు-ఏటూరునాగారం రోడ్డును రాష్ట్రీయ రహదారిగా మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలోనే ప్రతిపాదనలు పంపి సర్వే చేసినా ప్రయత్నాలు ఫలించలేదు. కొత్తగా అంశం తెరపైకి వచ్చింది. భద్రాచలం క్రాస్‌రోడ్ నుంచి ఏటూరునాగారం వరకు సుమారు 92.9 కి.మీ రహదారిని రాష్ట్రీయ రహదారిగా మార్చనున్నారు. ప్రస్తుతం ఇది కోర్ రహదారిగా ఉంది. నాలుగు వరుసలుగా మార్చే అంశంపై ఆర్అండ్‌బీ శాఖ నివేదికలు పంపింది.

**1,500పైన ఉంటేనే...**

ప్రధాన రహదారిపై రోజుకి 1,500 పైగా వాహనాలు తిరిగితే రాష్ట్రీయ రహదారిగా మార్చే అవకాశం ఉంది. బూర్గంపాడు-ఏటూరునాగారం రహదారిపై అంతకుమించి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్యాసింజర్ కార్ యూనిట్స్(పీసీయూ) 12450, కమర్షియల్ వాహనాలు 2943 తిరుగుతున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

ఎంతో సౌలభ్యం.. నాలుగు వరుసల రహదారిగా మార్చితే ఎంతో సౌలభ్యం ఉంటుంది. సూర్యాపేట-హైదరాబాద్ రహదారిని జాతీయ రహదారిగా మార్చటంతో, హైదరాబాద్ వెళ్లే వాహనాలు ఏటూరునా



గారం మీద నుంచి కాకుండా సూర్యాపేట నుంచి వెళ్తున్నాయి. నాలుగు వరుసల రహదారిగా మార్చితే ఇతర ప్రాంతాలకు చెందిన వాహనాలు బూర్గంపాడు-ఏటూరునాగారం రహదారి మీదుగా వెళ్తాయి. దీంతో అశ్వాపురం, మణుగూరుతోపాటు మలుగు జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలు అభివృద్ధి కానున్నాయి. రానున్న రోజుల్లో సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌పై పర్ణశాల వెళ్లేందుకు వంతెన నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు వరుసల రహదారి మంజూరైతే అశ్వాపురం మీదుగా పర్ణశాల వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరగనుంది.

ప్రతిపాదనలు పంపాం - హరిలాల్, డీఈ ఆర్అండ్‌బీ

బూర్గంపాడు-ఏటూరునాగారం రహదారిని నాలుగు వరుసల రహదారిగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపాం. వాహనాల లెక్క ఇచ్చాం. గతంలో సర్వే చేసినా ఎటువంటి ముందడుగు లేదు.

# గంజాయి తాగితే పట్టేస్తుంది!

ఖమ్మం : గంజాయి రవాణా, వినియోగాన్ని నిర్మూలించడం ఆబ్కారీ, పోలీసుశాఖలకు సవాలుగా మారుతోంది. గంజాయి తాగి రోడ్డుమీద తిరిగేవారిని గుర్తించడం కష్టం. మద్యం తాగి వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు 'బ్రీత్ అనలైజర్' పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే గంజాయి తాగినవారిని గుర్తించేందుకు ప్రత్యేక కిట్లు వచ్చాయి. ఒక్కో పోలీసు స్టేషన్‌కు 5 నుంచి 10 గంజాయి పరీక్ష కిట్లను పంపిణీ చేశారు.పోలీసులు తనిఖీల సందర్భంగా పలువురు అనుమానితులను పట్టుకుంటారు. వీరిలో గంజాయి తాగారన్న అనుమానం ఉన్నవారిని వైద్య పరీక్షలకు పంపిస్తారు. ఫలితాలు రావడం ఆలస్యమవుతుంది. ఈ జాప్యాన్ని నివారించేందుకు 'ఎబాన్ డ్రగ్ యూరిన్ టెస్టు కిట్' ఉపయోగపడుతుంది. ఇది 12 రకాల మాదక ద్రవ్యాల గుట్టు విప్పనుంది. మద్యం తాగినవారికి మాదక ద్రవ్యాలు ఉపయోగించిన వారి ప్రవర్తనలో తేడా ఉంటుంది. పట్టుబడినవారిలో గంజాయి తీసుకున్నారనే అనుమానం వస్తే వారిని స్టేషన్‌కు లేదా సమీప ఆసుపత్రికి తీసుకెళ్తారు. వీరి మూత్రం చుక్క ఈ కిట్‌లో వేస్తే పాజిటివ్, నెగెటివ్ చూపిస్తుంది.



## ఏపీలోనూ హైడ్రాను ఏర్పాటు చేయాలి: నారాయణ


విజయవాడ : నగరంలో సంభవించిన భారీ వర్షాలు, వరదలను కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సీపీఐ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. పాత రాజరాజేశ్వరిపేటలో వరద బాధితులకు చీరలు, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వం బుడమేరును యుద్ధ ప్రాతిపదికన ఆధునీకరించాలని నారాయణ డిమాండ్ చేశారు. వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో ప్రజలు సర్వం కోల్పోయారని వివరించారు. కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించేలా ప్రధాని మోదీపై సీఎం చంద్రబాబు ఒత్తిడి తీసుకురావాలన్నారు. జాతీయ విపత్తు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లను కేటాయించాలని.. విపత్తులు సంభవించినప్పుడు ఆ నిధులు వాడుకోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వరద ప్రభావిత ప్రాంతాల్లో రాత్రింబవళ్లు తిరిగి బాధితులకు సహాయక చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం పెంచాలని.. వరదల కారణంగా నష్టపోయిన విద్యార్థులకు ప్రత్యేకంగా సాయం అందించాలని కోరారు. తెలంగాణలో తరహా ఏపీలో కూడా హైడ్రాను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు.




## వైకాపాకు మరో షాక్.. బాలినేని రాజీనామా

అమరావతి: వైకాపాకు మరో షాక్ తగిలింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జగన్‌కు పంపారు. జగన్ విధానాలు నచ్చకే రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.ఒంగోలులో బాలినేని మీడియాతో మాట్లాడారు. "కొన్ని రోజులుగా వైకాపా అధిష్ఠానం వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తూనే ఉన్నాను. గురువారం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలవబోతున్నాను. ఆ పార్టీలో చేరబోతున్నాను" అని బాలినేని తెలిపారు.

## సీఎం చంద్రబాబుకు వరద బాధితుల కృతజ్ఞతలు



విజయవాడ, సెప్టెంబర్ 18: టీడీపీ నేత బుద్దా వెంకన్న కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటానికి టీడీపీ కార్యకర్తలు, వరద బాధితులు పూలాభిషేకం చేశారు. విపత్తులో వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు సేవలు ఆదర్శనీయం అంటూ వరద బాధితులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. "మా బాబు బంగారం" అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ.. విపత్తు సమయంలో బాధితులకు సహాయక చర్యలు చేపట్టిన చంద్రబాబు పని తీరు ఆదర్శమన్నారు. ఇప్పుడు వరద బాధితులకు 25 వేల రూపాయలు సాయం అందిస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా ఈ తరహాలో సాయం అందించిన సీఎం ఎవరూ లేరని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ నిద్రాహారాలు మాని పని చేసిన సీఎం చంద్రబాబు అని కొనియాడారు. విజయవాడ, రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు రుణపడి ఉన్నారన్నారు. దీనిని కూడా జగన్మోహన్ రెడ్డి రాజకీయం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు.

గత ఐదేళ్లల్లోప్రజల పాట్లు జగన్ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు కూడా వరద రాజకీయం చేయడానికి నవ్వుతూ వచ్చి ప్రజల్లో నవ్వుల పాలయ్యారన్నారు. కోటి రూపాయలు జగన్ ఎవరికి ఇచ్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. విపత్తుల్లో ప్రజలను ఆదుకోకపోగా కుట్రలు చేశారని మండిపడ్డారు. ప్రజలంతా చంద్రబాబు పడిన కష్టం చూసి చలించారన్నారు. చంద్రబాబుకు పుష్పాభిషేకాలు, పాలాభిషేకాలు ప్రజలే స్వచ్ఛందంగా చేస్తున్నారని బుద్దా వెంకన్న పేర్కొన్నారు.

**వరద బాధితులకు ప్యాకేజీ..** మరోవైపు.. భారీ వర్షాలు విజయవాడను ముంచెత్తిన విషయం తెలిసిందే. బుడమేరుకు మూడు చోట్ల గండ్లు పడి వరదనీరు విజయవాడ నగరంలోని అనే ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. లక్షలాది మంది నిరాశ్రయులు అయ్యారు. అయితే సీఎం చంద్రబాబు స్వయంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి వారికి ఆహారం, తాగునీరు అందేలా పక్కాగా చర్యలు చేపట్టారు. నష్టపోయిన ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు వరద బాధితులకు సాయం అందజేస్తున్నట్లు ప్యాకేజీ వివరాలను తెలుపుతూ చంద్రబాబు ట్వీట్ చేశారు. "భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు మంచి ప్యాకేజీని ప్రకటించాం. విజయవాడ వరదల సమయంలో 10రోజులపాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌నే సచివాలయంగా మార్చుకుని మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి బాధితులకు సాయం చేశా. ఇప్పుడు నష్టం అంచనాలను పూర్తి చేసి గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వం ఇవ్వని స్థాయిలో సాయం చేస్తూ ప్రజలకు అండగా నిలబడ్డాం. విజయవాడ నగరంలో వారం, పది రోజులపాటు వరదలో చిక్కుకుని ముంపునకు గురైన ప్రతి ఇంటికీ రూ.25వేలు ఆర్థికసాయం, పైఅంతస్తుల్లో ఉన్న వారికి రూ.10వేలు ఆర్థికసాయం చేస్తాం" అని సీఎం ప్రకటించారు. "రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో వరదలకు ఇల్లు మునిగి ఇబ్బంది పడిన ప్రతి కుటుంబానికి రూ.10వేలు అందిస్తాం. కిరాణా షాపులు, చిన్న వ్యాపారాలు కోల్పోయిన వారికి రూ.25వేలు, ఎంఎస్ఎంఈలకు, వ్యాపార సంస్థ స్థాయిని బట్టి రూ.50 వేల నుంచి రూ.1.50లక్షల వరకూ ఆర్థికసాయం చేయాలని నిర్ణయించాం. దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలకు రూ.3వేలు, ఆటోలకు రూ.10వేలు చొప్పున అందిస్తాం.అలాగే దెబ్బతిన్న ధాన్యం, పత్తి, చెరకు, వేరుసెనగ పంటలకు హెక్టారుకు రూ.25వేలు, అరటి, పసుపు వంటి ఉద్యానవన పంటలకు హెక్టారుకు రూ.35వేలు సాయం చేస్తాం. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కష్టాల్లో ఉన్న ప్రజలకు సాయంగా నిలబడాలనే ఉద్దేశ్యంతో బెస్ట్ ప్యాకేజ్ ఇచ్చి వారికి తోడుగా నిలుస్తున్నాం. బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ ఏజెన్సీల ద్వారా కూడా మంచి సాయం అందేలా చేస్తున్నాం. మత్స్యకారుల బోట్లకు, చేనేత కార్మికులకు, పశువుల కోల్పోయిన రైతులకూ పరిహారం అందిస్తున్నాం. వరదల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి అన్నీ పరిశీలించి ఈ ప్యాకేజీని ప్రకటిస్తున్నామని" సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## ఏపీ అభివృద్ధికి కూటమి సర్కార్ కృషి..



విజయవాడ, సెప్టెంబర్ 18: ప్రజా సమస్యల పరిస్కారం కొరకు బీజేపీ వారధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణు కుమార్ రాజు అన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న వారధి కార్యక్రమంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ... బీజేపీ వారధి కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. గత ఐదు సంవత్సరాలలో వైసీపీ చేసిన దురాగతాలకు ప్రజలు అనేక విధాలుగా ఇబ్బందులకు గురయ్యారన్నారు. 100 రోజుల కూటమి ప్రభుత్వం పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయటంతో పాటు రాష్ట్ర అభివృద్ధి కొరకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని విష్ణుకుమార్ రాజు వెల్లడించారు.

## ప్రజలకు జవాబుదారీగా పనిచేసేందుకు సిద్ధం: డీజీపీ ద్వారకా తిరుమలరావు



ఏలూరు: ప్రజలకు జవాబుదారీగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. ఏలూరులో మీడియాతో ఆయన మాట్లాడారు. పోలీసుశాఖలో మౌలిక వసతులు పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పోలీసులు ధైర్యంగా పనిచేసేలా సంసిద్ధం చేస్తున్నామని చెప్పారు. "పోలీసుల సంక్షేమం కోసం కొన్ని కార్యక్రమాలు చేపట్టాం. పోలీస్ క్యాంటీన్ల వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.4.7 కోట్లు ఇచ్చాం. ఎస్‌హెచ్‌వోలకు ఇన్వెస్టిగేషన్ ఛార్జీలు రాలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.


ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం. లైంగిక దాడులను నివారించేందుకు ప్రజల కు అవగాహన కల్పిస్తున్నాం. ముంబయి నటి కేసులో ప్రాథమిక విచారణ పూర్తయింది. ఇంకా లోతైన విచారణ జరగాల్సి ఉంది"అని డీజీపీ తెలిపారు.

## తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు విడుదలయ్యాయి. డిసెంబర్ నెలకు సంబంధించిన ఆర్జిత దర్శనాల ఆన్‌లైన్ కోటాను విడుదల చేశారు. ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు నమోదుకు అవకాశం కల్పించారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ, సహస్ర దీపాలంకార సేవ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవా టికెట్లను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటా విడుదల చేస్తారు. 24న ఉదయం 10 గంటలకు డిసెంబరు నెల ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటా విడుదల చేస్తారు.

27న ఉదయం 11 గంటలకు డిసెంబరు నెలకు సంబంధించి తిరుమల, తిరుపతికి చెందిన శ్రీవారి సేవా కోటాను, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ, మధ్యాహ్నం ఒంటి గంటకు పరకామణి సేవా కోటా విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో సేవా టికెట్లను బుక్ చేసుకోవాలని తితిదే కోరింది.

## ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న బోట్ల తొలగింపు ప్రక్రియ



విజయవాడ, సెప్టెంబర్ 18: ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల పదో తేదీ నుంచి వివిధ పద్ధతుల్లో బోట్ల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే బ్యారేజ్ వద్ద చిక్కుకున్న పడవలు 80 టన్నుల బరువు ఉండటంతో అనేకసార్లు ఆటంకాలు ఎదురయ్యాయి. చివరకు కావడి మంత్రం వ్యూహంతో నిన్న (మంగళవారం) నీళ్ల అడుగున ఉన్న బోటును అధికారులు బయటకు తీశారు. భారీ బోటును నిన్న అర్ధరాత్రి గేట్ల వద్ద నుంచి దుర్గా ఘాట్ వరకు సిబ్బంది లాక్కెళ్లారు. మిగిలిన బోట్లు తీసేందుకు ఈరోజు (బుధవార) కూడా ఆపరేషన్ కొనసాగనుంది. మూడు రోజుల్లో అన్ని బొట్లు తొలగిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఎనిమిది రోజుల కష్టం తరువాత భారీ బోటు బయటకు రావడంతో అధికారుల్లో ఆనందం వెల్లివిరిసింది. కావడి మంత్రం వ్యూహం ఫలించడంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద ఓ బోటు పైకి లేచింది. 40 టన్నులున్న భారీ బోటును అధికారులు బయటకు తీశారు. ఇంకా బ్యారేజీలో రెండు భారీ, ఒక మెస్తారు బోట్లు చిక్కుకుని ఉన్నాయి. సూయిజ్ గేట్ల వద్ద సేఫ్టీ వాల్ ఉన్న కారణంగా వ్యూహం మార్చారు. సేఫ్టీ వాల్ దెబ్బ తినకుండా వేరే విధానం అమలు చేసి బోట్స్ బయటకు తీయాలని నిర్ణయం తీసుకున్నారు. అనుకున్న విధంగానే భారీ కార్గో బోట్లపై టన్ను బరువు ఉన్న గడ్డర్లను వెల్డింగ్ చేసి మునిగిన బోట్‌ను పైకి లేపారు. ఇసుక, నీరు చేరడంతో బోటు 100 టన్నుల బరువు పెరిగింది. దీంతో అధికారులు కొత్త వ్యూహంతో ఎట్టలేకలకు విజయవంతంగా ఒక బోటును బయటకు తీసుకొచ్చారు. మిగిలిన బోట్లను తీసుకువచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## రాహుల్‌కు బేషరుతుగా క్షమాపణ చెప్పాల్సిందే.. షర్మిల డిమాండ్



విజయవాడ, సెప్టెంబర్ 18: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెద్ద టెర్రరిస్టు అంటూ బీజేపీ, శివసేన చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం నాడు వన్‌టౌన్‌లో కాంగ్రెస్ ధర్నాకు దిగింది. ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, మస్తాన్ వలీ, జేడీ శీలం, నరహరశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజి ధర్నాలో పాల్గొన్నారు. మోడీ కేడీ, కిలాడి అంటూ నినాదాలు చేశారు. నోరు పారేసుకున్న నేతలపై అనర్హత వేటు వేయాలని ఈ సందర్భంగా షర్మిల డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాహుల్ వాస్తవాలు మాట్లాడితే తీవ్రవాదం అంటారా అని మండిపడ్డారు. ఆయన అడిగిన అంశాలపై సమాధానాలు చెప్పే ధైర్యం ఉందా అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. అదే తీవ్రవాదులకు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ బలయ్యారన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని.. మంటలు రేపి అందులో చలి కాచుకుంటారని దుయ్యబట్టారు. ముస్లింలు, దళితులకు అన్యాయం చేసిన పార్టీ బీజేపీ అని వ్యాఖ్యలు చేశారు. అగ్రవర్ణాలకే అన్ని కాంట్రాక్టులు కట్టబెట్టారని ఆరోపించారు. అట్టడుగు వర్గాలవారి కోసం బీజేపీ ఎప్పుడైనా పనిచేసిందా అని ప్రశ్నించారు. ప్రధాన పోస్టుల్లో ఎంతమంది ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో దళితులపై 35శాతం దాడులు జరిగాయన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారన్నారు. బీజేపీ దారుణాలను ఎత్తిచూపి ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. నేడు రాహుల్ గాంధీకే బీజేపీ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్‌పై నోరుపారేసుకున్న నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.


## కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తాం : మంత్రి లోకేశ్



అమరావతి : ఏపీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు విని పరిష్కరించేందుకే ప్రజా ప్రభుత్వం ఉందని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగా పరదాలు కట్టుకుని తిరగడం లేదని, కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఉండవల్లిలో మంత్రి నారా లోకేశ్ 32వ రోజు "ప్రజాదర్బార్" నిర్వహించారు. మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మంత్రి లోకేశ్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు.

ఆయా సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మహాత్మాగాంధీ పర్యటించిన పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గం ఎ.ముప్పాళ్ల గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని రాపర్ల జగన్నాథం మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. కుంచనపల్లి, ప్రాతూరు ప్రాంత రైతులు మంత్రిని కలిశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలాలు నీటమునిగి తీవ్రంగా నష్టపోయామని, ఆయిల్ ఇంజిన్లు సైతం నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన విధంగా సాయం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.

## దూసుకొస్తున్న ఎక్స్ఈసీ వైరస్ .. యూరప్‌లో తొలి కేసు నమోదు



కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని ఎంతగా కలవర పెట్టిందో అందరికి తెలిసిందే. ఆ కొవిడ్-19కు సంబంధించిన కొత్త వేరియంట్ ఎక్స్ఈసీ రూపంలో ఇప్పటికే యూరప్‌లో అంటు వ్యాధిలా విస్తరిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో ఈ ఎక్స్ఈసీ వేరియంట్‌ను తొలి సారి యూరప్‌లో గుర్తించారని తెలిపారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని ఎంతగా కలవర పెట్టిందో అందరికి తెలిసిందే. ఆ కొవిడ్-19కు సంబంధించిన కొత్త వేరియంట్ ఎక్స్ఈసీ రూపంలో ఇప్పటికే యూరప్‌లో అంటు వ్యాధిలా విస్తరిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో ఈ ఎక్స్ఈసీ వేరియంట్‌ను తొలి సారి యూరప్‌లో గుర్తించారని తెలిపారు. అనంతరం ఈ వేరియంట్ యూకే, యూఎస్, డెన్మార్క్‌తోపాటు ఇతర దేశాలకు సైతం విస్తరించిందని పేర్కొన్నారు. ఇది రెండు ఒమిక్రాన్ సబ్ వేరియంట్స్ నుంచి ఎక్స్ఈసీ హైబ్రిడ్ రకంగా అవిర్భవించిందని వివరించారు. శీతాకాలంలో ఈ వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో దీనిని ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ లేదా బూస్టర్ డోస్ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. తద్వారా ఆసుపత్రిలో చేరడం కానీ, అనారోగ్యం బారిన పడడం కాని ఉండదని చెప్పారు. ఇప్పటికే 27 దేశాల నుంచి 500 శాంపిల్స్ సేకరించగా.. ఆ నమూనాల్లో ఎక్స్ఈసీ వేరియంట్ గుర్తించినట్లు వెల్లడించారు. డెన్మార్క్, జర్మనీ, యూకే, నెదర్లాండ్స్‌లలో ఈ ఎక్స్ఈసీ బలంగా పెరుగుతుందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. జర్వం, గొంతు మంట, దగ్గు, వాసన తెలియక పోవడం, ఆకలి లేకపోవడం, ఒంటి నొప్పులు ద్వారా కొత్త రకం కోవిడ్ ఎక్స్ఈసీ లక్షణాలను గుర్తించ వచ్చన్నారు. పరిశ్రుభతను పాటించడంతోపాటు స్వచ్ఛమైన గాలిని పీల్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలకు యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన (సీడీసీ) ఈ సందర్భంగా సూచించింది.

# అలలపై సర్ఫింగ్ కోసం రెడీ అయిన మానుషి

మానుషి చిల్లర్ పరిచయం అవసరం లేదు. అక్షయ్ లాంటి స్టార్ హీరోతో బ్యాక్ టు బ్యాక్ అవకాశాలు అందుకుంది ఈ బ్యూటీ. ఇటీవల బిగ్ బడ్జెట్ చిత్రం %–%బడే మియాన్ చోటే మియాన్%–% డిజాస్టర్ అవ్వడం, అంతకుముందు కూడా పృథ్వీరాజ్ సినిమా డిజాస్టర్ అవ్వడం ఈ భామకు పెద్ద నిరాశను మిగిల్చింది. అయితే మానుషి తన పరాజయాలకు కలత చెందక నిరంతరం తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. తాజాగా మానుషి స్టన్నింగ్ ఫోటోషూట్




ఇంటర్నెట్‌లో వైరల్ గా మారింది. సర్ఫింగ్ స్లేట్ పట్టుకుని సముద్రపు అలలపైకి లంఘించడానికి రెడీ అవుతోంది. ఈ ఫోటోగ్రాఫ్‌లో చిట్టి పొట్టి పరికిణీ.. వైట్ టాప్ ధరించిన మానుషి డార్క్ బ్లాక్ కళ్లద్దాలు ధరించి అల్ట్రా స్టైలిష్‌గా కనిపిస్తోంది. బీచ్ పరిసరాల్లో మానుషి వైబ్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. మానుషి లుక్ ఆసమ్ అంటూ ఒక అభిమాని థంబ్స్ అప్ ఇచ్చాడు. మానుషి అడ్వెంచర్ స్పోర్ట్స్ ని అమితంగా ఇష్టపడుతుంది. కానీ ఇంతటి అందగత్తె అలాంటి రిస్కులు చేయడం అభిమానులకు నచ్చడం లేదు. నా కోసం నేను ప్రేరణ పొందుతాను.. అని చెప్పే మానుషి తదుపరి సినిమా కోసమే వెయిటింగ్. ఈసారి ఏ హీరో అవకాశం ఇస్తాడో చూడాలి. మాజీ ప్రపంచ సుందరిగా గుర్తింపు ఉన్నా కానీ, ఐశ్వర్యారాయ్, సుస్మితా సేన్ రేంజులో ఈ భామకు ఏదీ వర్కవుట్ కాలేదు. ముఖ్యంగా తాను నటించిన సినిమాలేవీ ఆశించిన విజయాల్ని ఇవ్వకపోవడం పెద్ద నిరాశ.

## కృతి శెట్టి.. ఎలా చేసినా లక్కు రాదే..

'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా అడుగుపెట్టిన అందాల భామ కృతి శెట్టి. మొదటి చిత్రంతోనే సూపర్ సక్సెస్ అందుకున్న కృతిశెట్టి తరువాత వరుసగా అవకాశాలు అందుకుంది. నానికి జోడీగా 'శ్యామ్ సింగరాయ్' చిత్రంలో నటించింది. ఆ మూవీ సక్సెస్ అయ్యింది. 'బంగార్రాజు' చిత్రంలో నాగ చైతన్యతో జతకట్టి హిట్ సొంతం చేసుకుంది. హ్యాట్రిక్ హిట్స్ తో కృతి శెట్టి టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ రేస్ లోకి వచ్చింది. తరువాత వరుసగా బ్యాక్ టూ బ్యాక్ మూవీస్ చేసింది. అలాగే కెరీర్ మొదలు పెట్టి రెండేళ్ళు కాకముందే కోటి రూపాయలుకు రెమ్యునరేషన్ డిమాండ్ చేసింది. అయితే 'బంగార్రాజు' తర్వాత కృతిశెట్టి చేసిన ఏ మూవీ కూడా హిట్ కాలేదు. దీంతో తెలుగులో క్రమంగా అవకాశాలు కూడా తగ్గిపోయాయి. రెమ్యునరేషన్ కూడా తగ్గించాల్సి వచ్చింది.



ఆమె చివరిగా ఈ ఏడాది 'మనమే' సినిమాలో శర్వానంద్ కి జోడీగా నటించింది. ఈ సినిమాతో తెలుగులో బ్రేక్ వస్తుందని కృతిశెట్టి ఆశపడింది. అయితే ఈ సినిమా కూడా కమర్షియల్ ఫెయిల్యూర్ గా మారింది. దీంతో కృతిశెట్టి మీద టాలీవుడ్ లో ఐరన్ లెగ్ ఇమేజ్ పడిపోయిందనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం అయితే ఈ బ్యూటీ చేతిలో ఒక్క తెలుగు సినిమా కూడా లేదు. మలయాళంలో టోవినో థామస్ కి జోడీగా చేసిన 'అజాయంతే రందం మోషణం' మూవీలో కృతిశెట్టి నటించింది. ఈ సినిమా మలయాళీలో పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమాని రిలీజ్ చేశారు. అయితే తెలుగు నేటివిటీకి ఈ మూవీ కథ సింక్ కాలేదు. దీంతో తెలుగులో ఆశించిన స్థాయిలో ఆదరణ రాలేదు. ఈ మూవీ తెలుగులో సక్సెస్ అయితే మరల అవకాశాలు వస్తాయని కృతి శెట్టి భావించిన నిరాశే ఎదురైంది. ప్రస్తుతం కృతి శెట్టి తమిళంలో కార్తీకి జోడీగా 'వావాతియార్' సినిమాలో నటించింది. ఈ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. తెలుగులో కూడా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చే ఛాన్స్ ఉంది. 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథ్ కి జోడీగా 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే మూవీలో చేస్తోంది. విగ్నేష్ శివన్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇది కూడా తెలుగులో రిలీజ్ కానుంది. అలాగే జయం రవికి జోడీగా 'జెనీ' అనే చిత్రం చేస్తోంది. ఈ సినిమాలు హిట్ అయితే మరల తన ఫేట్ మారుతుందని కృతి శెట్టి భావిస్తోంది. ఈ సినిమాలు హిట్ అయితే తమిళంలో అయితే ఇమేజ్ పెరగడం గ్యారెంటీ. కానీ తెలుగులో ఏ మేరకు ఛాన్స్ లు దక్కించుకుంటుందనేది వేచి చూడాలి.




# తమిళ దర్శకుడిపై తారక్ ఫోకస్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ ని తమిళ్ ఆడియన్స్ కూడా మెల్లగా ఓన్ చేసుకుంటున్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాకి తమిళంలో సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు 'దేవర' సినిమాకి అంతకుమించి స్పందన వస్తుందని భావిస్తున్నారు. దీనికి కారణం ఉంది. ఎన్టీఆర్ తమిళ్ దర్శకుల శైలిని, వారు చెప్పే కథలని ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. చాలా కాలం నుంచి ఎన్టీఆర్ తో వెట్రిమారన్, అట్లీ లాంటి దర్శకులు సినిమాలు చేస్తారనే ప్రచారం నడుస్తోంది.

గతంలో వీరిద్దరూ ఎన్టీఆర్ ని కలిసి కథలు కూడా నేరేట్ చేయడం జరిగిందని టాక్. వెట్రిమారన్ 'విడుదలై' సినిమా రిలీజ్ సమయంలో కోవిడ్ కి ముందు ఎన్టీఆర్ ని కలిసి కథ చెప్పడం జరిగిందని తెలిపారు. కథ అతనికి నచ్చిందని, అయితే వరుస కమిట్మెంట్స్ కారణంగా ఎన్టీఆర్ తో సినిమా చేయడానికి ఆలస్యం అవుతుందని చెప్పారు. దానిని బట్టి వెట్రిమారన్ దర్శకత్వంలో మూవీ కన్ఫర్మ్ అయ్యిందనే ప్రచారం అప్పట్లోనే వచ్చింది. ఇదిలా ఉంటే తాజాగా ఎన్టీఆర్ కోలీవుడ్ డెబ్యూ గురించి తన మనసులో మాట బయటపెట్టారు. 'దేవర' ప్రమోషన్స్ లో భాగంగా ఎన్టీఆర్ చెన్నైకి వెళ్లారు. అక్కడ తమిళ్ మీడియా మీట్ లో తారక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటరెస్టింగ్ విషయాలని పంచుకున్నారు. స్ట్రైట్ తమిళ్ మూవీ మీరు ఎప్పుడు చేస్తారు సర్ అని ఓ జర్నలిస్ట్ ఎన్టీఆర్ ని ప్రశ్నించారు. దీనికి ఎన్టీఆర్ సమాధానం ఇస్తూ వెట్రిమారన్ కి రిక్వెస్ట్ చేశారు. నా అభిమాన దర్శకుడు వెట్రిమారన్. అతను ఎప్పుడు నాతో సినిమా చేస్తానంటే అప్పుడు నేను తమిళంలో చేస్తాను అని ఎన్టీఆర్ క్లారిటీ ఇచ్చారు. వెట్రిమారన్ సర్ నాతో మూవీ చేయండి. అది స్ట్రైట్ తమిళ్ లో చేసి తెలుగులో డబ్ చేద్దాం అంటూ ఎన్టీఆర్ స్టేజ్ పైనే రిక్వెస్ట్ పెట్టారు. మరి దీనిపై వెట్రిమారన్ ఎలా రియాక్ట్ అవుతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

వెట్రిమారన్ చెప్పే కల్ట్ కథలో ఎన్టీఆర్ నటిస్తే కచ్చితంగా అవి దేశ వ్యాప్తంగా అందరికి రీచ్ అవుతుందని సినీ విశ్లేషకులు అంటున్నారు. గతంలో వీరిద్దరి మధ్య డిస్కషన్స్ జరిగాయి కాబట్టి కచ్చితంగా మూవీ ఉంటుందని ఎన్టీఆర్ మాటలతో కన్ఫర్మ్ అయ్యింది. అయితే ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలు ఎక్కుతుంది అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'దేవర' తర్వాత ఎన్టీఆర్ 'వార్ 2', 'డ్రాగన్', 'దేవర2' ప్రాజెక్ట్స్ కంప్లీట్ చేయాల్సి ఉంది. ఈ సినిమాల తర్వాత వెట్రిమారన్ దర్శకత్వంలో మూవీ ఉండొచ్చని టాక్.

# దేవర టికెట్ ధరలు ఎలా ఉండబోతున్నాయి?



యంగ్ టైగర్ ఎన్టీఆర్ 'దేవర' మూవీ సెప్టెంబర్ 27న థియేటర్స్ లోకి వస్తోంది. పాన్ ఇండియా రేంజ్ లో ఐదు ఇండియన్ భాషలలో ఈ చిత్రం రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ మూవీ ప్రమోషన్స్ లో మేకర్స్ బిజీగా ఉన్నారు. ఎన్టీఆర్ ఈ చిత్రాన్ని దగ్గరుండి పబ్లిక్ లోకి తీసుకొని వెళ్తున్నారు. కచ్చితంగా 'దేవర' మూవీ దేశవ్యాప్తంగా భారీ కలెక్షన్స్ ని కొల్లగొట్టడం గ్యారెంటీ అని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. పాన్ ఇండియా సినిమాలకి తెలుగు రాష్ట్రాలలో టికెట్స్ పెంచడం ఆనవాయితీగా వస్తోంది. మేకర్స్ ముందుగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకి దరఖాస్తు చేసుకుంటే టికెట్ ధరలని పర్టిక్యులర్ టైం వరకు పెంచుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఇలా టికెట్ ధరలు పెంచడం వలన పాన్ ఇండియా సినిమాలకి కలెక్షన్స్ పరంగా అదనపు అడ్వాంటేజ్ అవుతుంది. 'దేవర' సినిమాకి కూడా ఇప్పుడు టికెట్ ధరలు పెంచుకోవడానికి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పర్మిషన్ ఇవ్వబడుతున్నాయి.ఏపీలో సింగిల్ స్క్రీన్ థియేటర్స్ లో 200, మల్టీప్లెక్స్ 325 రూపాయిలు టికెట్ ధరలు పెంచుకోవడానికి పర్మిషన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. అలాగే తెలంగాణాలో సింగిల్ స్క్రీన్ థియేటర్స్ లో 250, మల్టీ ప్లెక్స్ లలో 413 రూపాయిల ధరకి టికెట్స్ అమ్ముకునే అవకాశం ఉంటుంది. అలాగే ఐదు షోలకి కూడా అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ పెంచిన ధరలతో కచ్చితంగా 'దేవర' మూవీ మొదటి రోజు సాలిడ్ ఓపెనింగ్స్ ని సొంతం చేసుకోవడం గ్యారెంటీ అని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. టికెట్ ధరలు పెంచిన కూడా ఫ్యాన్స్ నుంచి భారీ స్పందన రావడం గ్యారెంటీ అని మేకర్స్ భావిస్తున్నారు. కానీ కాంటెంట్ బలంగా క్లిక్కయితేనే మిగతా ఆడియెన్స్ కూడా థియేటర్స్ కు వచ్చే అవకాశం ఉంటుంది. ఫైనల్ గా కంటెంట్ హీరో. ఇక సినిమాపై ఉన్న బజ్ కారణంగా నార్త్ అమెరికాలో 'దేవర' మూవీ టికెట్స్ జెట్ స్పీడ్ తో బుక్ అవుతున్నాయి. ఇదే జోరు ఇండియాలో కూడా ఉంటుందని ఎక్స్ పెక్ట్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే 'దేవర' మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్ ఈ నెల 22న నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లోనే ఈ ఈవెంట్ గ్రాండ్ గా జరగబోతోంది. దీనికి ఐకాన్ స్టార్ మహేష్ బాబు గెస్ట్ గా వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మరో వైపు ఈ సినిమా స్పెషల్ ప్రీమియర్స్ కోసం సెప్టెంబర్ 25న ఎన్టీఆర్ యూఎస్ వెళ్ళబోతున్నారు. అక్కడ ప్రీమియర్ షోలకి తారక్ అటెండ్ అయ్యి ఫ్యాన్స్ తో మాట్లాడుతారు.

# నిర్మాతలకు చుక్కలు చూపిస్తున్న యానిమల్ బ్యూటీ

యానిమల్ చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకుని అటుపై వరుస చిత్రాలకు సంతకాలు చేసిన ట్రిప్తి దిమ్రీ పారితోషికం అమాంతం పెంచేసిందని కథనాలొస్తున్నాయి. ఇటీవలే బాడ్ న్యూజ్‌తో మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. దీంతో ట్రిప్తికి ఎదురే లేకుండా పోయిందని నిర్మాతల్లో గుసగుస వినిపిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్‌లో అత్యంత బిజీ నటీమణులలో ఒకరిగా మారిన ట్రిప్తీ ఇప్పుడు తన పారితోషికాన్ని రూ. 10కోట్లకు పెంచినట్టు తెలుస్తోంది. బ్యాడ్ న్యూజ్ కోసం రూ. 6 కోట్లు అందుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు అమాంతం 4 కోట్లు పెంచి మొత్తంగా 10కోట్లు డిమాండ్ చేస్తోంది. ట్రిప్తీ ఇంటి ముందు క్యూ అంతకంతకు పెరుగుతోంది. దీంతో డిమాండ్‌కి తగ్గట్టే



పారితోషికాన్ని అమాంతం పెంచేసిందని తెలిసింది. గ్లామర్ షో పరంగా ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో ట్రిప్తీ చుట్టూ నిర్మాతలు క్యూ కడుతున్నారని కూడా గుసగుస వినిపిస్తోంది. ప్రస్తుత లైనప్ చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ట్రిప్తీ ఇటీవల వరుసగా సీక్వెల్ సినిమాల్లో నటిస్తోంది. భూల్ భూలైయా 3, ధడక్ 2 ఇప్పటికే లైన్‌లో ఉన్నాయి. బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ నుంచి ఆషిఖి 3లోను నటిస్తోందని కథనాలొచ్చాయి. విక్కీ విద్యా కా వో వాలా వీడియో ఇప్పటికే కన్ఫామ్ అయింది. ఇతర ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి. ట్రిప్తి ప్రస్తుతం అడ్వాన్సుల రూపంలో భారీ మొత్తాలను అందుకుంది. వాటిని రియల్ వెంచర్లలో పెట్టుబడులుగా పెడుతోంది. ఇటీవలే బాంద్రాలో ఖరీదైన అపార్ట్ మెంట్ ని కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

## ఒణికిపోతూనే రొమాన్స్ చేసాం: మాళవిక

మాళవిక మోహనన్ పరిచయం అవసరం లేదు. విజయ్ 'మాస్టర్' సినిమాలో నటించింది. ఇటీవల ప్రభాస్ రాజా సాబ్ లో నటిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రాజా సాబ్ 2025 లో మోస్ట్ అవైటెడ్ చిత్రంగా విడుదల కానుంది. ఈలోగానే సిద్ధాంత్ చతుర్వేదితో కలిసి యాక్షన్ థ్రిల్లర్ యుధ్రాతో మాళవిక బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుంది. ఈ చిత్రం నుంచి రొమాంటిక్ ట్రాక్ సాథియాలో ఈ జంట కెమిస్ట్రీ అందరి దృష్టిని ఆకర్షించింది. అయినప్పటికీ గడ్డకట్టే మంచులో రొమాంటిక్ సన్నివేశాలను చిత్రీకరించడం ఒక సవాల్ గా మారిందని మాళవిక వెల్లడించింది. అడ్డంకులు ఉన్నప్పటికీ యాక్షన్ సన్నివేశాలలో సిద్ధాంత్ అంకితభావాన్ని మెచ్చుకుంది. ఒక అద్భుత శృంగార డ్రామాతో తన బాలీవుడ్ కలను నెరవేర్చుకోవడంపై తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. అందమైన తమిళమ్మాయి యువహీరో సిద్ధాంత్ చతుర్వేదితో రొమాన్స్ చేయడం గమ్మత్తుగా ఉందని అంది. రవి ఉద్యవార్ యుధ్ర చిత్రానికి దర్శకత్వం వహించారు. నిర్మాతలు



ఈ చిత్రం నుండి ట్రైలర్, పాటను విడుదల చేయగా వాటికి చక్కని స్పందన వస్తోంది. ఇటీవల విడుదల చేసిన సాథియా పాటలో ఈ అందమైన జంట కెమిస్ట్రీ హైలైట్ గా నిలుస్తోంది. అయితే మాళవిక మీడియాతో మాట్లాడుతూ.. ఈ మూవీ కోసం సన్నిహిత సన్నివేశాలను చిత్రీకరించడంలో పలు సవాళ్లు ఎదురయ్యాయని వెల్లడించింది. అక్కడ ఉన్న వాతావరణ పరిస్థితుల్లో సాన్నిహిత్యాన్ని కొనసాగించడం కష్టమని తెలిపింది. అయితే సెట్‌లో సీన్ విషయంలో సమన్వయకర్తలు ఉండటం వల్ల పని వేగంగా పూర్తి చేయగలిగామని అంది. అయితే సాథియా పాటను చిత్రీకరించడం ఊహించనంత సవాల్ గా మారింది. షూట్ సమయంలో చల్లని గడ్డకట్టే వాతావరణంలో ఇంటిమేట్ సన్నివేశాలను చేయడం కష్టతరంగా మారిందని మాళవిక వెల్లడించింది. తాము గడ్డకట్టే చలితో ఒణికిపోయామని వెల్లడించింది. దీంతో రొమాన్స్ పై దృష్టి పెట్టడం చాలా గమ్మత్తుగా మారింది. మేం అలలకు వ్యతిరేకంగా ఉన్నాము.. పూర్తిగా తడిసిపోయాము.. అక్కడ అంతా గడ్డకట్టింది! అని మాళవిక వెల్లడించింది. చివరి ముద్దు సన్నివేశం కూడా కష్టంగానే షూట్ చేసామని వెల్లడించింది. అంతేకాదు షూట్‌లో చాలా సమయం నవ్వులతో నిండిపోయిందని.. తెరవెనుక అనుభవాన్ని కూడా మాళవిక వినోదభరితంగా వివరించింది. కష్టపడి చేసిన ఈ పాట ఒక అద్భుతమైన రొమాంటిక్ గీతంగా నిలుస్తుందని తెలిపింది. ఇది సుందరమైన బీచ్ సెట్టింగ్‌లు.. డ్రమటికల్ స్లో–మోషన్ షాట్‌లతో సంపూర్ణంగా అందరూ మెచ్చేలా రూపొందిందని పేర్కొంది.



# విద్యార్థుల్లో స్కిల్ అప్‌గ్రేడేషన్ చేసేందుకు కృషి: రేవంత్ రెడ్డి

హైదరాబాద్: ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంఎస్ఎంఈ నూతన పాలసీని సీఎం విడుదల చేశారు. తాము చేసే ప్రతి ప్రయత్నమూ రాష్ట్ర భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. యువతకు వ్యవసాయం, పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టేందుకు తగిన చేయూతనిస్తామని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో యువత ఎదిగేవిధంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. "దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పుడు పీవీ నరసింహారావు కృషిని మనం జ్ఞాపకం చేసుకోవాలి. ప్రపంచంతో పోటీపడేలా పీవీ ఆర్థిక విధానాలు తీసుకొచ్చారు. విధానాల రూపకల్పనలు లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదు. రాష్ట్రంలోని విద్యార్థుల్లో స్కిల్ అప్‌గ్రేడేషన్ చేయడానికి కృషి చేస్తున్నాం. పరిశ్రమలకు గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలను చెల్లిస్తాం. కొవిడ్ వ్యాక్సిన్ తయారీలో కూడా మనం రాష్ట్రం ముందుంది. ఐటీ, ఫార్మా అభివృద్ధికి కాంగ్రెస్ ఎంతో కృషి చేసింది. రాష్ట్రంలో ప్రతి ఏడాది లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం. వ్యవసాయం అనేది దండగ కాదు.. పండగ అనేది మా ప్రభుత్వ నినాదం. రూ. 18వేల కోట్ల నిధులు విడుదల చేసి రైతుల రుణాలు తీర్చాము. తెలంగాణ రాష్ట్రం వడ్డించిన విస్తరాకును తలపిస్తోంది. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీరు, ఆర్థిక సాయం అందిస్తాం. మూసీ నది వీక్షణకు పర్యటకులు ఇతర దేశాల నుంచి వచ్చేలా అభివృద్ధి చేస్తాం. దళితులు, గిరిజనలు, మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం బాగుపడినట్లు. ప్రభుత్వ పాఠశాలలను కూడా ఎంతో మెరుగుపరుస్తున్నాం" అని వెల్లడించారు.

# వన్ ట్రిలియన్ ఎకానమీనే సీఎం సంకల్పం: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి ఎంఎస్ఎంఈల పాలసీని విడుదల చేసినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎంఎస్ఎంఈల పాలసీ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "రాబోయే కాలంలో ఎంఎస్ఎంఈల్లో సాంకేతికతను వాడుకోవాలి. ఎంఎస్ఎంఈలను కాపాడుకోవాలని రాహుల్ గాంధీ కోరారు. ఎక్కువ స్థాయిలో ఉపాధి కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈలు. ఈ పరిశ్రమలకు చెందిన 120 మంది ప్రముఖుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నాం. హైదరాబాద్‌తోపాటు ఇతర జిల్లాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే మా ప్రభుత్వ విధానం. మన రాష్ట్రం వన్ ట్రిలియన్ ఎకానమీ చేరుకోవాలని సీఎం సంకల్పించారు. పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మౌలిక వసతులతో ప్లాట్ ఫ్యాక్టరీస్ ఏర్పాటు చేస్తాం. కొత్తగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం. కేంద్రం నుంచి ఆర్థిక సాయం పొందేందుకు సాంప్రదాయ, ప్రత్యామ్నాయం మార్గాలు చూశాం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఆర్థిక పురోభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషిస్తాయి. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతులు జరిగేలా అందుబాటులోకి తీసుకొచ్చాం" అని తెలిపారు.

**రాహుల్ ఆలోచనతోనే కొత్త పాలసీ: భట్టి...** 'రాహుల్ గాంధీ ఆలోచనలతోనే ఎంఎస్ఎంఈ నూతన పాలసీ తీసుకొచ్చాం. చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడ్డాయి. ఇక్కడ ఇతర రాష్ట్రాలకు విభిన్నంగా రూపొందించారు. ఎంఎస్ఎంఈ పాలసీ రూపొందించిన శ్రీధర్ బాబుకు ధన్యవాదాలు. ఆర్థిక వ్యవస్థ పటిష్ఠత కోసం ఎంఎస్ఎఈలు కీలకం. దేశ జీడీపీకి, రాష్ట్ర జీడీపీకి ఎంఎస్ఎంఈ ఎంతో తోడ్పడుతుంది. దాదాపు రూ. 80వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు బహుళ జాతి కంపెనీలు ముందుకు వచ్చాయి. భారీ పరిశ్రమలకు ఎంఎస్ఎంఈల నుంచి పలు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి" అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.




హైదరాబాద్ : కుమారీ ఆంటీ.. ఈపేరు పరిచయమక్కర్లేదు. హైదరాబాద్‌లో రోడ్ సైడ్ ఫుడ్ స్టాల్ పెట్టుకుని బిజినెస్ చేసుకుంటూ సోషల్ మీడియా పుణ్యమా అని ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు. అయితే వరద బాధితుల కోసం తన వంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు కుమారీ ఆంటి.

ఈ మధ్య కురిసిన భారీ వర్షాలకు ఖమ్మం, వరంగల్ సహా చాలా జిల్లాలు చిగురుటాకులా వణికిన విషయం తెలిసిందే. దీంతో భారీగా నష్టం వాటిల్లింది. వందల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. వారిని ఆదుకునేందుకు ప్రముఖులు, కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చారు. అదే సమయంలో కుమారీ ఆంటీ కూడా తన వంతు సాయం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తన నివాసంలో ఆమె బుధవారం కలిశారు. ఆ సమయంలో ఆమె వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు. అనంతరం వరద బాధితుల సహాయార్థం సీఎంఆర్ఎఫ్‌కు రూ.50 వేలను విరాళంగా అందించారు.

సీఎం రేవంత్ రెడ్డి ఆమెను అభినందించారు. కుమారీ ఆంటీ సాయంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్.. పార్టీ ఆఫీస్ కూల్చివేతకు ఆదేశాలు..

భారత రాష్ట్ర సమితి పార్టీకి హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. ఆ పార్టీ తరపున వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. అంతేకాదు.. నల్లగొండ జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేయాలని ఆదేశించింది. ఇందుకోసం 15 రోజులు గడువు కూడా విధించింది. ఇంతకీ ఏం జరిగింది? హైకోర్టు ఎందుకు అలాంటి ఆదేశాలిచ్చింది? కీలక వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.. నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌ను అక్రమంగా నిర్మించారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూమిలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని నిర్మించారని, ఈ అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలంటూ మున్సిపల్ శాఖ అధికారులను సైతం ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌ను కూల్చివేసేందుకు సిద్ధమయ్యారు.

**హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్..** మంత్రి ఆదేశాల నేపథ్యంలో.. బీఆర్ఎస్ పార్టీ అలర్ట్ అయ్యింది. హైకోర్టును ఆశ్రయించింది. బీఆర్ఎస్ కార్యాలయాన్ని రెగ్యులర్ చేసే విధంగా మున్సిపల్ శాఖ అధికారులకు ఆదేశాలివ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. పార్టీ కార్యాలయం కట్టిన తరువాత ఏ రకంగా అనుమతిస్తారని సూటిగా ప్రశ్నించింది. కట్టక ముందు అనుమతి తీసుకోవాలి గానీ.. కట్టిన తరువాత ఎలా అనుమతి తీసుకుంటారని హైకోర్టు ప్రశ్నించింది. 15 రోజుల్లో పార్టీ కార్యాలయాన్ని కూలగొట్టాలంటూ మున్సిపల్ అధికారులను ఆదేశిచింది. అంతేకాదు.. రూ. 1 లక్ష పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీని ఆదేశించింది.

# గురుకులాల పతనానికి సీఎం రేవంత్ రెడ్డే బాధ్యుడు : రవీంద్ర కుమార్

నల్లగొండ : గురుకులాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ఆరోపించారు. దేవరకొండ మైనార్టీ గురుకుల పాఠశాలలో నిన్న ముగ్గురు విద్యార్థులు తప్పిపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలను సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గురుకుల పాఠశాలలు అధ్వానంగా మారుతున్నాయి. కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మండి పడ్డారు. గురుకులాల అధ్వాన పరిస్థితికి, విద్యార్థుల మరణాలకు విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డినే బాధ్యుడన్నారు. మీ పాలన ఎట్లుందో చెప్పడానికి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న గురు కులాలే నిదర్శనం అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో వెలుగొందిన గురుకులాలు మీ అసమర్థత కారణంగా మసకబారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల మీద నోరు పారేసుకోవడం మానేసి ఇప్పటికైనా పాలన మీద దృష్టి పెట్టాలని హితవు పలికారు. మొద్దు నిద్రను వీడి గురుకులాల్లో విద్య, భోజనం, వసతులు కల్పించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముగ్గురు విద్యార్థులను సురక్షితంగా తీసుకొచ్చి తల్లితండ్రులకు అప్పగించాలన్నారు.




# గణేశ్ నిమజ్జనం.. గతేడాది కంటే మెరుగైన పరిస్థితి: సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్: గణేశ్ నిమజ్జన కార్యక్రమం నగరంలో కొనసాగుతోంది. గణేశ్ నిమజ్జనం త్వరగా పూర్తిచేసేందుకు 25వేల మంది సిబ్బంది నిర్విరామంగా కృషి చేశారని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. రెండు షిఫ్టుల్లో పనిచేశారని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పరిస్థితి మరింత మెరుగ్గా ఉందని తెలిపారు. బుధవారం ఉదయం 5 గంటలకి గణేశ్ శోభాయాత్ర చివరి భాగం ఎంజే మార్కెట్ వరకు చేరుకుందన్నారు. కొన్ని వాహనాలు మాత్రమే అప్రోచ్ రోడ్లలో ఉన్నాయని తెలిపారు. మొత్తం 11 రోజుల్లో లక్ష విగ్రహాలు హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనమైనట్లు చెప్పారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకరించిన అన్ని విభాగాల అధికారులకు అభినందనలు తెలిపారు. 8-9 గంటల మధ్య దాదాపు రోడ్లన్నీ సాధారణ ట్రాఫిక్ వెళ్లేందుకు వీలుగా అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నట్లు సీపీ చెప్పారు.

# టీపీసీసీ చీఫ్ సరికొత్త నిర్ణయం.. ఇకపై వారానికి రెండు సార్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 18: రాష్ట్ర మంత్రులకు సంబంధించి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఇకపై వారానికి రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌కు వచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు విధి విధానాలను, మంత్రుల షెడ్యూల్‌ను రూపొందించాలని గాంధీ భవన్ సిబ్బందికి టీపీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంత్రులు ప్రతి వారంలో రెండుసార్లు గాంధీ భవన్ రావాలని ఆయన సూచించారు. ప్రతి బుధ, శుక్రవారాలలో ఒక్క మంత్రి.. గాంధీ భవన్‌కు రావాలని మహేష్ సూచించారు. వచ్చే శుక్రవారం నుంచి గాంధీ భవన్‌కు మంత్రుల రాక ప్రారంభంకానున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన మహేష్ ముందు పెద్ద సవాలే ఉంది. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. తాము ప్రజా పాలనను అందిస్తున్నామని.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతోంది. మరోవైపు కాంగ్రెస్ పాలనపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు దుమ్మెత్తిపోస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం మహేష్ ముందున్న అతిపెద్ద సవాల్‌గా చెప్పుకోవచ్చు. సీనియర్ నేత మహేష్ కుమార్‌కు



టీపీసీసీ చీఫ్ పదవి వరించింది. మహేష్‌కు నాలుగు దశాబ్దాలుగా పైగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉంది. ఎలాంటి పదవులు ఆశించని వ్యక్తి ఆయన. అందరినీ కలుపుకుంటూ పోతూ అధిష్టానం తనకు అప్పగించిన పనులను చేసుకుంటూ వెళ్తుంటారు. టీపీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్‌ను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీ ఓటర్లు ఎక్కువగా ఉండటం.. ఈ మధ్య కాలంలో బీసీ నినాదం ఎక్కువ వినిపిస్తుండటంతో.. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్‌కు పీసీసీ పదవి దక్కింది.

# ఆయన స్క్రిప్ట్ ప్రకారమే తిట్ల పురాణం... హైడ్రా డ్రామాలు..



హైదరాబాద్, సెప్టెంబర్ 18: తెలంగాణలో దరిద్రపు పాలన నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ఇచ్చిన హామీలు చర్చకు రావొద్దనే రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. సునీల్ కనుగోలు స్క్రిప్ట్ ప్రకారమే తిట్ల పురాణం... హైడ్రా డ్రామాలు అంటూ విరుచుకుపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో అవినీతి కుటుంబ పాలన, దందాలు నడుస్తున్నాయన్నారు. పార్టీ ఫిరాయింపులపై రాహుల్ గాంధీది ఒక విధానం... రేవంత్ రెడ్డికి ఇంకో విధానమా అని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో భయపెట్టి వసూళ్ల దందా చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అంటూ దుయ్యబట్టారు. తమ్మిడి కుంట ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టిన సిపాయి హిమాయత్ సాగర్‌లో ఉన్న ఆనంద కన్వెన్షన్ ఎందుకు కూల్చలేదని నిలదీశారు. నాగార్జునను రూ.400 కోట్లు డిమాండ్ చేశారని... ఇవ్వనందుకే కూల్చారని ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయన్నారు. ఫ్యూచర్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన నడుస్తలేదని... ప్రతిపక్ష ఎమ్మెల్యేల మీద కేసులు పెడుతున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్‌తో పాటు తమ నాయకుల వ్యక్తిత్వాల మీద సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లు పెడుతున్నారన్నారు. రేవంత్ టీమ్లో ఉండి ఫేక్ న్యూస్‌లు పెడుతున్న వారిని కేసీఆర్, కేటీఆర్ వదిలిపెట్టినా తాను వదిలి పెట్టనని బాల్కసుమన్ హెచ్చరించారు.

# దళితులపై ఇంత కర్కశత్వమా..? ఆ బిడ్డలే కాంగ్రెస్ సర్కార్‌కు ఘోరి కడుతరు..! జూపల్లిపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్ : దళితులపై చిర్రుబుర్రులాడిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జటప్రోల్ గ్రామంలోని సమీకృత గురుకుల పాఠశాల భవనం కోసం దళితుల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంచుకుంది. ఈ నేపథ్యంలో అన్యాయంగా మా భూమిని తీసుకోవద్దని న్యాయం చేయండని వచ్చిన దళితులపై ఇంత కర్కశత్వం ప్రదర్శిస్తారా..? అని కేటీఆర్ మండిపడ్డారు. బాధిత దళిత బిడ్డలు మీ భూములు ఇవ్వాలని అడగలేదు.. వారికి గతంలో ఇచ్చిన భూములను తీసుకోకుండా న్యాయం చేయండని మాత్రమే అడిగారు. అంత మాత్రాన నోరు మూయ్ అంటూ సెక్యూరిటీని పెట్టి పంపిస్తారా? ఇందిరమ్మ రాజ్యంలో దళితులకు న్యాయం చేయరా%ొ%? అణిచివేత ఎక్కువైతే తిరుగుబాటు మొదలవుతుందన్న సహజ సూత్రాన్ని మర్చిపోకండి... ఆ దళిత బిడ్డలే మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఘోరి కడుతరు అని జూపల్లి కృష్ణారావును కేటీఆర్ హెచ్చరించారు. ంగళవారం సదరు స్థలాన్ని పరిశీలిచేందుకు మంత్రి జూపల్లి రాగా, సర్వే నంబర్ 508లో ఎనిమిది ఎకరాల భూమిని నాటి జటప్రోల్ సంస్థానాధీశులు రాజా జగన్నాథరావు తమకు ఇచ్చారని దళితులు కిష్టన్న, పెంటయ్య, బాలయ్య, బాలపీరు, సంగమయ్య, శేషమ్మ, శాలయ్య, బాలయ్య తెలిపారు.

దీంతో మంత్రి నోరు మూయండని బాధితులను బెదిరించారు. సెక్యూరిటీ వారిని అడ్డుకున్నారు. న్యాయం కోసం వస్తే పట్టించుకోలేదని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు.

# అన్నదాతలకు అండగా నిలుస్తున్న అగ్రి హబ్.. సంతోషంగా ఉందన్న కేటీఆర్

హైదరాబాద్ : వ్యవసాయ రంగంలో ఇన్నొవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లను ప్రోత్సహించేందుకు 2021లో కేసీఆర్ ప్రభుత్వం అగ్రి హబ్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఏ సదుద్దేశంతో నెలకొల్పామో దాన్ని అగ్రి హబ్ విజయవంతంగా నెరవేరుస్తున్నందుకు, అన్నదాతలకు అండగా నిలుస్తున్నందుకు సంతోషంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి ఈ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ గుర్తు చేశారు. బ్లాక్ చైన్, రోబోటిక్స్, క్లౌడ్, డ్రోన్ల, వంటి అధునాతన సాంకేతికలతో రైతుల సమస్యలకు పరిష్కారాలు చూపేందుకు 2021 ఆగస్టులో ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నాటి కేసీఆర్ ప్రభుత్వం అగ్రి హబ్‌ను స్థాపించిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఇది దేశంలోనే వ్యవసాయ రంగంలో మొదటి ఇంక్యుబేటర్‌గా గుర్తింపు పొందింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేయనున్న హబ్ సేవలను గ్రామీణ ప్రాంతాల రైతులకు చేరువ చేసేందుకు వరంగల్, జగిత్యాల, వికారాబాద్‌లో అగ్రి హబ్ ప్రాంతీయ కేంద్రాలు ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. అగ్రిహబ్‌ను 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. రోబోటిక్ విధానంలో కలుపు తీయడం, డ్రోన్‌ల ద్వారా పంటలో తెగుళ్లను గుర్తించడం వంటి సమాచారం అందుబాటులో ఉంటుంది. గ్రామీణయువత, మహిళలు, రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అగ్రిబిజినెస్ మెళకువలు నేర్చుకునేందుకు గ్రంథాలయంగా ఉపయోగపడుతుంది. నాణ్యతగల విత్తనాలు, మొక్కలకు కావల్సిన ఎరువులు, పురుగుమందులు, పంట దిగుబడి తదితర వివరాలు అందుబాటులో ఉంటాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com